ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

సోమవారం 20 మే 2024





కారంపూడి పోలీస్‌స్టేషన్లో ఫైల్స్‌ను పరిశీలిస్తున్న సిట్ అధికారులు

అరాచకాలపై ఆ...రా... గ్రహం

జిల్లాలో కొనసాగుతున్న సిట్ విచారణ

- హింసాత్మక కేసులు, సెక్షన్లపై పరిశీలన
- పరారీలో ఉన్న వారందరినీ పట్టుకు రావాలి
- నరసరావుపేట, కారంపుడి, దాచేపల్లిలో దర్యాప్తు



దాచేపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న సిట్ అధికారులు

నరసరావుపేట, కారంపూడి, దాచేపల్లి, రెంటచింతల, మే 19: పోలింగ్ విధ్వంసాలు, ఆ తర్వాత జరిగిన హింసలపై సిట్ బృందం రెండో రోజు ఆదివారం జిల్లాలో విచారణ కొనసాగించింది. అరాచకాలు జరిగిన తీరు.. నమోదైన కేసులు.. అరెస్టుల వివరాలు తెలుసుకున్న సిట్ ఆయా ఘటనలను ఎందువల్ల కట్టడి చేయలేకపోయారని స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ విభాగాల పనితీరులో చోటుచేసుకున్న లోపం కూడా అల్లర్లకు కారణమని సిట్ గుర్తించినట్లు సమాచారం. జిల్లాలో పోలింగ్ రోజు, తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై సిట్ విచారణ రెండో రోజు ఆదివారం కొనసాగింది. స్థానిక పోలీసు అధికారుల వైఫల్యాన్ని గుర్తించడంతో పాటు కేసుల నమోదులో అవసరమైన మార్పులు.. చేర్పులు, సెక్షన్ల మార్పుపై చర్యలు చేపడుతున్నారు. రెంటచింతల, నరసరావుపేట రెండో పట్టణ పోలీసు స్టేషన్లలో విచారణ శనివారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఆదివారం ఉదయం తిరిగి దర్యాప్తును ప్రారంభించింది. నరసరావుపేట ఒకటో పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్లలో సిట్ అధికారి సౌమ్యలత విచారణ చేశారు. నరసరావుపేటలో జరిగిన అరాచకాలపై వీడియో ఫుటేజ్‌ను పరిశీలించారు. కార్లు ధ్వంసం, కారు దహనం, మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద వైసీపీ మూకల దాడులు, గుంటూరు రోడ్డులో జరిగిన పరస్పర దాడులకు సంబంధించిన వివరాలను సేకరించారు. ఈ సంఘటలను జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో పోలీసుల వైఫల్యాన్ని గుర్తించినట్లు సమాచారం. నమోదైన ఎఫ్ఐఆర్‌లపై పోలీసు అధికారులను ప్రశ్నించారు. ఆయా కేసులను పునః సమీక్షించనున్నారు. నరసరావుపేటలో రబ్బరు బుల్లెట్లతో కాల్పులు జరపడానికి కారణాలపై సదరు పోలీసు అధికారులను ప్రశ్నించారు.

అధికారుల పాత్రపై విచారణ..

కొన్ని చోట్ల పోలీసు అధికారుల సాయంతోనే అల్లర్లు, విధ్వంసాలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో సదరు అధికారుల కాల్ డేటా ఆధారంగా సిట్ సమాచారం సేకరిస్తోంది. ఇటువంటి అధికారులపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సిట్ బృంద సభ్యులు శనివారం రాత్రి రెంటచింతలకు చేరుకుని స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ విభాగాల పనితీరును పరిశీలించినట్లు తెలిసింది. ఎన్నికల సమయంలో జరిగే ఘర్షణలు, నేతల కదలికలు, ఎత్తుగడలను పసిగట్టి అధికారులకు తెలియచేయాల్సిన స్పెషల్ బ్రాంచ్ విభాగం ఆ పని చేయలేదని జరిగిన సంఘటనలు బలపరుస్తున్నాయని సిట్ బృందం అంచనా వేసినట్లు సమాచారం. ఇక స్వతంత్రంగా పనిచేసే ఇంటెలిజెన్సు పనితీరు లోపాలపై సిట్ అధికారులు దృష్టి పెట్టారు.

వెంకట్రామిరెడ్డిపై కేసుల నమోదు పరిశీలన

కారంపూడిలో పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సిట్ బృందం విచారణ చేపట్టింది. ఇరువర్గాలు చేసిన విధ్వంస కాండపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఫైల్స్‌ను బృందంలోని అధికారులు పరిశీలించారు. దాడులకు సంబంధించి ఎంతమందిని అదుపులోకి తీసుకున్నారు.. ఎందరిని కోర్టులో హాజరుపరిచారు అనే అంశాలను పరిశీలించారు. ఘర్షణలో పాల్గొని ప్రస్తుతం పరారీలో ఉన్న వారి వివరాలను నమోదు చేసుకున్నారు. వారందరినీ అదుపులోకి తీసుకోవాల్సిందేనని స్థానిక అధికారులకు సిట్ బృందం సూచించింది. వైసీపీ మూకలు మారణాయుధాలతో స్వైరవిహారం చేయడం, టీడీపీ కార్యాలయం ధ్వంసం, దాడుల వీడియో దృశ్యాలను కూడా పరిశీలించినట్లు తెలిసింది. దాడుల్లో స్వయంగా పాల్గొన్న ఎమ్మెల్యే సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిపై కేసుల నమోదు అంశం కూడా ప్రస్తావించినట్లు సమాచారం. దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సిట్ అధికారులు రికార్డులను పరిశీలించారు. తంగెడ పోలింగ్ కేంద్రంపై వైసీపీ మూకలు పెట్రో బాంబుల తో దాడిపై సిట్ స్థానిక పోలీసు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. బాంబు దాడులకు పాల్పడితే బందో బస్తులో ఉన్న సిబ్బంది ఏం చేస్తున్నారని నిలదీసినట్లు సమాచారం. దాచేపల్లిలో కనిశెట్టి నరేంద్ర, కేశానుపల్లిలో నెల్లూరి రామకోటయ్యపై దాడి చేసి గాయపరచడం, ఇరికేపల్లిలో వైసీపీ, టీడీపీ పరస్పర దాడులకు సంబంధించి వివరాలు తీసుకున్నారు. గాయపడిన వ్యక్తులను విచారించారు. దాచేపల్లి సీఐ సురేంద్రబాబు, ఎస్ఐలు శివనాగరాజు, అమీవుద్దీన్‌లను విచారించారు. ఆయా గ్రామాలకు చెందిన బాధితులు స్టేషన్‌కు చేరుకుని జరిగిన సంఘటనలపై అధికారులకు వివరాలు అందజేశారు. సిట్ బృందంలో ఓ డీఎస్పీ, ముగ్గురు సీఐలు ఉన్నారు. శనివారం రాత్రి రెంటచింతలకు చేరుకున్న సిట్ బృందం కొన్నిగంటల పాటు దాడుల ఘటనలకు సంబంధించి సీసీ ఫుటేజ్‌ను పరిశీలించి ఎవరెవరూ ఎలాంటి హడావుడి చేశారనే దానిపై పేర్లతో సహా ఒక నిర్ధారణకు వచ్చింది. నిందితుల ఆనవాళ్లు గుర్తించడంతో పాటు వారి ఆధారాలను సేకరించింది.



దుర్గి :మించాలపాడులో పోలీసులు స్వాధీనం చేసుకున్న రికార్డులు లేని బైకులు



ఉపాధి పనుల్లో కూలీలు

ఉపాధికి ఊతం

పని దినాల వివరాలు..

పల్నాడు	87,48,695
బాపట్ల	74,26,878
గుంటూరు	30,71,889

- మూడు జిల్లాల్లో 1.92 కోట్ల పని దినాలు
- కూలీల వలసల కట్టడికి చర్యలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కూలీల వలసల నివారణకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్నారు. వారికి పనులు కల్పించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో 1.92 కోట్ల పనిదినాలు కల్పించనున్నారు. గత ఏడాది ఇదే స్థాయిలో పని దినాలను కల్పించారు. జాబ్ కార్డుల ఆధారంగా పనిదినాలను నిర్ధారించారు. ఏడాది మొత్తంలో నెలల వారీగా ఏ నెలలో ఎన్ని పనిదినాలు కల్పించాలన్న లక్ష్యాలను రూపొందించి నివేదికలు సిద్ధం చేశారు.

గ్రామాల్లో నిధులులేక ప్రగతి పనులు నిర్వహించలేని దుస్థితి నెలకొంది. పల్లెల్లో ప్రగతి పనులు, మరమ్మతుల వంటి పనులు చేపట్టేందుకు ఉపాధి పథకం వరంగా మారింది. గామాల్లో కూలీలకు పని కల్పించి ఉపాధి అందిస్తున్నారు. ప్రగతి పనులకు మెటీరియల్ విభాగం కింద నిధుల విడుదలతో అభివృద్ధికి అవకాశాలు ఏర్పడుతున్నాయి. కూలీలకు ఉపాధితో పాటు అభివృద్ధి పనులకు సాకారం ఏర్పడుతోంది. గతంలో సిమెంట్ రోడ్లు, ప్రభుత్వ భవనాలు నిర్మించిన విషయం తెలిసిందే. జలసంరక్షణ పనులకు ప్రాధాన్యం కల్పించారు. అధ్వాన్నంగా ఉన్న పంట కాలువలను పునరుద్ధరణ పనులు ఈ పథకం కింద విస్తృతంగా చేపడుతున్నారు. చెరువుల్లో పూడికతీత, నీటికుంటల తవ్వకం, వాగుల్లో పూడికతీత, పొలాల రహదారుల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నారు. ఈసారి మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. గతంలో రోడ్ల పక్కన మొక్కలు నాటారు. వీటిని సంరక్షించ టంలో నిర్లక్ష్యం వలన 25 శాతం మొక్కలు కూడా మిగలలేదు.

పల్నాడు జిల్లాలో నీటి వనరుల అభివృద్ధికి సంబంధించి ఇప్పటి వరకు 50,833 పనులు చేపట్టనున్నారు. వీటిలో 18,608 పనులు జరుగుతున్నాయి. వీటిలో 884 పనులు పూర్తి చేశారు. అయా పనులకు 192.31 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా 1039 పనులు చేపడు తున్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. పారిశుధ్యం, రోడ్లు, భవనాలు, ఆహార ఉత్పత్తుల నిల్వకు గోదాములు తదితర పనులు 223.24 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. 21,930 పనులు చేపట్టగా 4,861 పనులు పురోగతిలో ఉన్నాయి. బాపట్ల జిల్లాలో జలవనరులు అభివృద్ధికి సంబంధించి 45,394 పనులను రూ.161.13 కోట్ల వ్యయంతో చేపట్టగా 1069 పనులు పూర్తయ్యాయి. 21,281 పనులు కొనసాగు తున్నాయి. గ్రామీణ మౌలిక సదుపాయల కల్పన కోసం 19,665 పనులు 20.85 కోట్ల వ్యయంతో చేపట్టగా 20 పనులు పూర్తి కాగా 4,344 పనులు కొనసాగుతున్నాయి. గుంటూరు జిల్లాలో జలవనరుల నిర్వహణకు సంబంధించిన పనులు 19,306 పనులు 66.30 కోట్ల వ్యయంతో చేపట్టగా 564 పనులు పూర్తి కాగా 7,508 పనులు కొనసాగుతున్నాయి. గ్రామీణ మౌలిక సదుపాయల కల్పన కోసం 12.64 కోట్ల వ్యయంతో 13,226 పనులు చేపట్టగా 1,594 పనులు కొనసాగుతున్నాయి.



ఓటుకు ఇంధనం

- ఎన్నికల్లో నల్లధన ప్రవాహం
- రూ.2,000 కోట్లు ప్రజా వినియోగంలోకి
- రూ.1,000 నుంచి రూ.4 వేలకు ఓటు కొనుగోలు
- మద్యం కొనుగోళ్ళకు నల్లధనమే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో నల్లధనం ప్రవాహించింది. ఓట్లు, మద్యం కొనుగోళ్లకు నల్లధనాన్నే వినియోగించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.1,700 కోట్లు ప్రజా వినియోగంలోకి వచ్చాయి. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ఇదే అత్యంత ఖరీదైన ఎన్నికలని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఓటు రేటు రూ.1,000 నుంచి రూ.4 వేలు పలికింది. మద్యం, డబ్బు విచ్చల విడిగా నియోజకవర్గాల్లో పంపిణీ చేశారు. ఒక్కో నియోజకవర్గంలో అభ్యర్థుల ఖర్చు రూ.60 కోట్ల నుంచి రూ.100 కోట్లు వరకు ఉంది. యథేచ్ఛగా ఓట్ల కొనుగోలు జరిగినా ఎన్నికల అధికారులు చోద్యం చూశారు. ఏ నియోజక వర్గంలో నామమాత్రపు చర్యలు కూడా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోలేదు. ఎక్కడా చర్యలు కన్పించక పోవటం తో పగటి పూట కూడా బహిరంగంగానే డబ్బు పంపి ణీ చేశారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై క నీస నిఘా ఏర్పాటు చేయటంలో ఎన్నికల అధికారులు ఘోరంగా విఫలమయ్యారు.

అభ్యర్థులు ఓట్ల కొనుగోలుకు రూ.కోట్లు కుమ్మరించారు. ఇవేవి ఏ శాఖ లెక్కల్లో కన్పించవు. ఏడాదిగా పోగు చేసిన నల్లధనాన్ని అభ్యర్థులు ఓట్ల కొనుగోలుకు వినియోగించారు. ప్రధాన పార్టీలు ఓట్ల కొనుగోలుకు పోటీ పడ్డాయి. ఓట్ల కొనుగోలుకు వినియోగించిన డబ్బు ఎక్కడా లెక్క చూపించిన దాఖలాలు లేవు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు లక్షన్నర నుంచి రెండు లక్షల వరకు ఓట్లు కొనుగోలు చేశాయి. ఇలా ప్రతి నియోజకవర్గంలో మూడు నుంచి నాలుగు లక్షల ఓట్లు కొనుగోలు చేశాయి. రూ.2 వేలు చొప్పున నియోజక వర్గంలో మూడు లక్షల ఓట్లు కొనుగోలు చేసి ఉంటే ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖర్చు రూ.60 కోట్లు అవుతుంది. అయితే ఇదిలా ఉంటే పది రోజుల పాటు విచ్చలవిడిగా మద్యం పంపిణీ చేశారు. ఒక్కొక్క నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు ఒక్కో పార్టీ రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు మద్యం పంపిణీకి వినియోగించింది. అలాగే పదిరోజుల పాటు వందల సంఖ్యలో భోజనాలు, ప్రచారంలో పాల్గొనే వారికి కూలీ కింద ఇచ్చే డబ్బు ఇలా వివిధ రకాల ఖర్చు అభ్యర్థులు చేశారు. పట్టణాల్లో ఓటుకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు, పల్లెల్లో ఓటుకు రూ.1500 నుంచి రెండు వేల వరకు పంపిణీ చేశారు.

పల్లె ఓటరు కంటే పట్టణ ఓటు గిరాకీ అధికంగా ఉంది. పల్నాడులో ఓటు రేటు అధికంగా ఉంది. తెనాలి ప్రాంతంలో ఓటు రేటుతక్కువగా ఉంది. ఇక్కడ రూ.1000 నుంచి 2వేల వరకు కొనుగోలు చేస్తే పల్నాడులో కొన్ని చోట్ల రూ.4వేల వరకు ఓటు రేటు పలికింది. పలు నియోజకవర్గాల్లో పట్టణ ఓటర్లకు రూ.2,000 నుంచి రూ.2,500 వరకు పంపిణీ చేశారు. అత్యధికంగా పెదకూరపాడు నియోజకవర్గంలో ఓటుకు రూ.4వేల వరకు పంపిణీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అత్యధికంగా ఈ నియోజకవర్గంలోనే ఓటు రేటు ఉంది.

రూ.200 నుంచి రూ 4 వేలకు

ఎన్నికల్లో ఓటు రేటు ప్రతి ఎన్నికలకు మారుతూ వస్తున్నది. 2004లో జరిగిన ఎన్నికల్లో కొన్ని నియోజక వర్గాల్లో రూ.200కు ఓటు కొనుగోలు చేశారు. 2009లో ఓటు రేటు రూ.500కు పెరిగింది. 2014 ఎన్నికల్లో ఏకంగా ఓటు రేటు వెయ్యి నుంచి రూ.1,500లు పలికింది. 2019 ఎన్నికల్లో ఓటు రేటు రూ.2వేల వరకు నెలకొంది. ఈ ఎన్నికల్లో రూ.1000 నుంచి రూ.4000 ఓట్ల కొనుగోలు జరగడం చర్చనీయాంశమైంది. ప్రతి ఎన్నికల్లో ఓటు రేటు దాదాపు రెట్టింపు అవుతూ వస్తోంది. ఓటు కొనుగోలు చేయటంలో ప్రధాన పార్టీల అభ్యర్థులెవ్వరూ వెనకడుగు వేయటం లేదు. ఒక కుటుంబంలో ఐదు ఓట్లు ఉంటే పట్టణంలో ఇరు పార్టీలు రూ.2వేలు చొప్పున డబ్బు ఇస్తే ఆ కుటుంబానికి రూ.20వేలు వచ్చినట్లే. కొన్ని చోట్ల డబ్బు పంపిణీలో జాప్యం జరిగితే ఓటర్లు అభ్యర్థుల ఇళ్ళకు వెళ్ళి మరీ తమకు డబ్బు ఇవ్వలేదని నిలదీసిన సంఘటనలు ఉన్నాయి. ఓట్ల కొనుగోలు మాట ఇలా ఉంటే మద్యం పంపిణీకి కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. కుబేరులు మాత్రమే ఇక జరగబోయే ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి. సామాన్యులు ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల్లో పోటీచేసి గెలవలేని పరిస్థితులు నెలకొన్నాయి. ధనం, మద్యం అభ్యర్థుల గెలుపు, ఓటముల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఊహకు అందని రీతిలో నల్లధనం వినియోగంలోకి వచ్చిందని చెప్పవచ్చు.

ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు

ఆర్వోలు, డీఎస్పీలతో ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్



బాపట్ల, మే 19: ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. కౌంటింగ్ సెంటర్లలో ఏర్పాట్లకు సంబంధించి ఆదివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు వారు పలుసూచనలు చేశారు. అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది తప్పని సరిగా నిబంధనలు పాటించాలన్నారు. కౌంటింగ్ రోజు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ కౌంటింగ్ రోజు బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల కాంపౌండ్ నుంచి 100 మీటర్ల బయట బారీకేడ్‌లు ఏర్పాటు చేయాలని, వాహనాల్ని లోపలికి అనుమతించరాదన్నారు. ప్రధాన ద్వారం వద్ద అభ్యర్థులను, కౌంటింగ్ ఏజెంట్లను, కౌంటింగ్ సిబ్బంది ని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించాలన్నారు. ఆర్వోలు ముందుగానే ఏజెంట్లకు, అభ్యర్థులకు గుర్తింపుకార్డులు మంజూరు చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గ కౌంటింగ్‌లో సంబంధిత ఆర్వోనే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని తెలిపారు. కౌంటింగ్ సెంటర్ల బయట మూడంచల భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికల అనంతరం జరుగుతున్న పరిణామాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఇప్పటికే పలు ఘటనలపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున జూన్ 6 వరకు ఎటువంటి ర్యాలీలు, ఊరేగింపులు, బాణాసంచా కాల్చడం నిషేధమని తెలిపారు. పెట్రోల్ బంకుల యాజమాన్యాలు లూజుగా క్యాన్లు, బాటిళ్లలో విక్రయాలు చేయరాదని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏఎస్పీ విఠలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలతోనే సరి

- రెండేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే
- నిలిచిన ఇండోర్ స్టేడియం పనులు
- నత్తనడకన రైతుబజార్ నిర్మాణాలు

రేపల్లె, మే 19: రెండేళ్లు అవు తుంది.. అయినా అభివృద్ధి పనులు ఒక కొలిక్కిరాలేదు. ఇండోర్ స్టేడియం, రైతుబజార్ నిర్మాణాలకు శంకుస్థాపన చేయగా.. ఇప్పటికీ అవి పూర్తి కాలేదు. ఎంపీ నిధుల నుంచి జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఇండోర్ స్టేడియానికి రూ.1 కోటి, రైతుబజార్ నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేశారు. వీటికి మంత్రి కొట్టు సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, మేరుగ నాగార్జునలు 2022 సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేశారు. అయితే ఇండోర్ స్టేడియం పనులు సగంలో ఆగిపోగా, రైతుబజార్ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. జరుగుతున్న పనులు చూస్తే ఇప్పట్లో ఇవి పూర్తై వినియోగం లోకి వచ్చే పరిస్థితి లేదనిపిస్తోంది. రెండేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు పనులు పూర్తి స్థాయిలో అయిన దాఖలాలు లేవు. ఇండోర్‌స్టేడియం పనులు సగంలోనే కాంట్రాక్టర్ నిలిపివే శారు. పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లులు రాని కారణంగానే పనులు చెయ్యలేకపోతున్నామని కాంట్రాక్టర్ వాపోతున్నారు. శంకుస్థాపన సభలో మంత్రులు మండలానికో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించారని, కానీ ఒక్క దాని పనులనే పూర్తి చేయలేకపోయారంటూ ప్రజలు విమర్శిస్తున్నారు.

- తీరంలోని రైతులు తాము పండించిన కూరగాయలు అమ్ముకునేందుకు రూ.2 కోట్లతో రైతుబజార్‌ను నిర్మిస్తున్నామని మంత్రులు హామీ ఇచ్చారు. ఈ క్రమంలో పట్టణంలోని పండ్ల మార్కెట్ వద్ద రైతుబజార్‌కు శంకుస్థాపన చేశారు. రెండేళ్లు కావస్తున్నా రైతు బజారు నేటికీ అటు రైతులకు, ఇటు వినియోగదారులకు అందు బాటులోకి రాలేదు. నిర్మాణ పనులు బేస్‌మెంట్ దశలోనే ఉన్నాయి. రెండేళ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు కూడా నాశిరకం గా ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని తెలిపారు.



జూనియర్ కళాశాల ప్రాంగణంలో అసంపూర్తిగా ఇండోర్ స్టేడియం నిర్మాణం



నత్తనడకన సాగుతున్న రైతుబజార్ భవనం

సూర్యలంక తీరంలో పర్యాటకుల సందడి



సూర్యలంక తీరంలో సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

బాపట్ల, మే 19: ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరంలో గత రెండు రోజులుగా పర్యాటకుల సందడి నెలకొని ఉంది. బాపట్ల పరిసరప్రాంతాలు నుంచే కాకుండా ఇతర ప్రాంతాలు నుంచి కూడా పర్యాటకులు పెద్దఎత్తున ప్రత్యేక వాహనాలలో వచ్చి సముద్రస్నానాలు చేస్తూ సరదాగా గడుపుతున్నారు. శని, ఆది వారాలల్లో పర్యాటకులు పెద్దసంఖ్యలో రావటం జరుగుతుంది. ప్రస్తుతం వేసవి సెలవు దినాలు కావటంతో ఎప్పటి కంటే ఎక్కువగా పర్యాటకులు విచ్చేసి సందడి చేస్తూ సముద్రస్నానాలు ఆచరిస్తూ సరదాగా గడుపుతున్నారు. ఆదివారం సూర్యలంక తీరానికి వచ్చిన పర్యాటకులు గుర్రపు స్వారీ, బైక్‌పై తిరగటం వంటి వాటితో సరదాగా గడిపారు.

దిక్సూచి
DIKSUCHI



ఇండియా శ్రామిక మార్కెట్

ఇండియన్ ఎకానమీ

భారతదేశం 1980 తరవాత ప్రత్యేకించి 1990 తరవాత సుస్థిరమైన అధికవృద్ధి రేటును నమోదు చేసింది. 2000 సంవత్సరం మొదటి అర్ధభాగంలో ఈ రేటు మరింత ఎక్కువగా నమోదైంది. కొన్నిసార్లు అది 8 శాతాన్ని కూడా దాటింది. అయితే 2008 తరవాత ప్రపంచ ఆర్థిక మందగమనం వల్ల అది క్రమేణా తగ్గి కొవిడ్ కాలంలో పూర్తిగా కుంగిపోయింది. ఇప్పుడు మరలా కోలుకుని అతి వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉంది. దాదాపు నాలుగు దశాబ్దాలపాటు సగటున ఆరు శాతం వార్షిక వృద్ధిని భారత ఆర్థికవ్యవస్థ నమోదు చేయడం విశేషం.

రాబోయే 15 సంవత్సరాలు భారత ఆర్థికవ్యవస్థ సగటున 5 నుంచి 6 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేస్తుందనే అంచనాలు ఉన్నాయి. ఇటీవల భారతప్రభుత్వ అంచనాల ప్రకారం భారత ఆర్థికవ్యవస్థ 2022లో 7.3శాతం, 2023లో 7.2 శాతం ఆర్థికవృద్ధిని నమోదు చేసింది. 2027 నాటికి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా, 2030 నాటికి ఏడు ట్రిలియన్ డాలర్ల స్థూల దేశీయోత్పత్తి గల దేశంగా అవతరించగలదనే అంచనాలు ఉన్నాయి. 1990 తరవాత భారత ఆర్థికవ్యవస్థ క్రమంగా ప్రపంచీకరణ పొందింది. 1984లో భారత స్థూల దేశీయోత్పత్తిలో వస్తుసేవల ఎగుమతుల విలువ 6.3 శాతం ఉండగా, 2022లో 22 శాతానికి చేరింది. అధిక ఆర్థికవృద్ధి రేటు నిరపేక్ష పేదరికాన్ని తగ్గించి, జీవన ప్రమాణాలను పెంచిందని చెబుతున్న మానవాభివృద్ధి సూచికలోనూ, తలసరి ఆదాయంలోనూ ఇతర దేశాలతో పోల్చితే భారతదేశం ఇంకా చాలా వెనుకబడి ఉంది. ఉదాహరణకు తలసరి ఆదాయాన్ని తీసుకుంటే 2024 ప్రపంచబ్యాంకు అంచనాల ప్రకారం జి.20 దేశాల్లో అతి తక్కువ తలసరి ఆదాయం గల దేశంగా భారత్ ఉంది. ఉదాహరణకు భారత ప్రజల తలసరి ఆదాయం కొనుగోలు శక్తి ఆధారిత స్థూల జాతీయాదాయం ప్రకారం 8,210 డాలర్లు కాగా అమెరికా ప్రజల తలసరి ఆదాయం 77,530 డాలర్లు. చైనా తలసరి ఆదాయం 21,250 డాలర్లు. ఇక అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రకారం భారత ప్రజల తలసరి ఆదాయం 2601 డాలర్లు, కొనుగోలు శక్తి ఆధారిత విలువ ప్రకారం 9,073 డాలర్లు. ఈవిధంగా ఆర్థికవ్యవస్థ వృద్ధి ఎక్కువగా ఉన్నా, ప్రపంచ అతిపెద్ద ఆర్థికవ్యవస్థల్లో ముందు స్థానానికి ఎగబాకుతున్నా మానవాభివృద్ధిలో, తలసరి ఆదాయంలో ఇతర దేశాల కంటే తక్కువగా ఉండటానికి పెరుగుతున్న వృద్ధి ఆర్థికవ్యవస్థ నిర్మాణ స్వరూపాన్ని విప్లవాత్మకంగా మార్చకపోవడమే కాకుండా, సేవలరంగ మూలధన ఆధారిత వృద్ధిగా ఉండి ఉపాధి అవకాశాలను తగినంతగా సృష్టించడంలో విఫలమవడమే కారణం.

ఉపాధి నిర్మాణ స్వరూపాన్ని మార్చలేని అధిక ఆర్థికవృద్ధిరేటు

పైన తెలిపిన అధిక ఆర్థికవృద్ధి రేటు ఉపాధి నిర్మాణంలో విప్లవాత్మక మార్పులు తేవడంలో విఫలమైంది. వ్యవసాయరంగంపై ఆధారపడిన వారి శాతం చాలా తక్కువ రేటుతో స్థిరంగా తగ్గగా, సేవలరంగంపై ఆధారపడిన వారి శాతం తక్కువ రేటుతో స్థిరంగా పెరిగింది. పారిశ్రామిక రంగంపై ఆధారపడిన వారి శాతం దాదాపు స్థిరంగా ఉంది. 2000లో వ్యవసాయరంగం మీద ఆధారపడిన వారు 60 శాతం ఉండగా, 2019లో 42 శాతం ఉన్నారు. అదేకాలంలో సేవలరంగంపై ఆధారపడినవారు 23 శాతం నుంచి 32 శాతానికి పెరగ్గా, వస్తు తయారీ రంగం(మాన్యుఫ్యాక్చరింగ్)లో 12 నుంచి 14 శాతం మాత్రమే ఉపాధి పొందుతున్నారు. అంతేకాకుండా ఇదేకాలంలో క్రమబద్ధమైన(రెగ్యులర్) ఉపాధి పొందుతున్న వారి శాతం 2000 సంవత్సరంలో 14 శాతం ఉండగా 2019 నాటికి 21 శాతంగా, సంఘటితరంగంలో పనిచేస్తున్న వారి శాతం 2000లో 12 శాతం ఉండగా, 2019లో 18 శాతంగా ఉంది. అయితే మొత్తం కార్మికుల్లో 90 శాతం అసంఘటిత కార్మికులు(సంఘటిత - అసంఘటిత రంగంలో గల అసంఘటిత కార్మికులు)గా ఉండటం గమనార్హం. అంతేకాకుండా మొత్తం ఆదాయంలో కార్మికుల ఆదాయ శాతం 2019లో కూడా 2000 సంవత్సరం కంటే ముందరి స్థాయిలోనే ఉన్నదని ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక పేర్కొంది.

తక్కువస్థాయి-మధ్యస్థాయి ఆదాయం గల దేశాల లక్షణాలతో ఇండియా శ్రామిక మార్కెట్



ఇండియా ఆర్థిక వృద్ధిరేటు ఎక్కువగా ఉన్నా, ఇండియా అతిపెద్ద ఆర్థికవ్యవస్థ సరసన చేరుతున్నా ఇండియా శ్రామిక మార్కెట్ మాత్రం తక్కువ-మధ్యస్థాయి ఆదాయం గల దేశాల లక్షణాలను కలిగి ఉన్నదని ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక తెలిపింది. కింది లక్షణాలను ఉదాహరణగా పేర్కొన్నది.

1. అభివృద్ధి చెందిన దేశాలు ఆరంభంలో పారిశ్రామికరంగం వృద్ధిలో ప్రధానంగా అభివృద్ధి చెందగా, ఇండియా మాత్రం సేవలరంగం సహాయంతో అధిక వృద్ధిరేటును నమోదు చేస్తున్నది. వ్యవసాయరంగంపై ఆధారపడిన జనాభా క్రమంగా తగ్గి అది పారిశ్రామికరంగంలో కాకుండా సేవలరంగంలో ఉపాధి పొందుతున్నది. అయితే స్థూల దేశీయోత్పత్తిలో సేవల రంగం వాటా 55 శాతం ఉండగా, ఉపాధిలో మాత్రం దీని వాటా 23 శాతంగానే ఉంది. స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం వాటా కేవలం 14 శాతం ఉండగా, వస్తువుల తయారీ రంగం(మాన్యుఫ్యాక్చరింగ్) వాటా 18 శాతంగానే ఉంది.
2. రెండు - మూడు శాతం ఉన్న బహిరంగ నిరుద్యోగం 2019 నాటికి 5.8 శాతానికి చేరడం.
3. కార్మికుల్లో 90 శాతం అసంఘటిత కార్మికులు ఉండటం. సంఘటితరంగంలో కూడా పెద్ద మొత్తంలో అసంఘటిత కార్మికుల నిష్పత్తి ఉండటం. మొత్తం కార్మికుల్లో 50 శాతం స్వయంఉపాధి పొందుతున్నవారు ఉండటం.
4. లింగపరంగా, ప్రాంతాల వారీగా, వృత్తుల వారీగా, వివిధ సామాజిక వర్గాల వారీగా, స్థానికత ఆధారంగా ఉపాధి అవకాశాల్లో, వేతనాల్లో పరిమితులు ఉండటం.
5. 2022లో మహిళా శ్రామికుల భాగస్వామ్యం రేటు కేవలం 25 శాతంగా ఉండటం. ప్రపంచంలోనే అతి తక్కువ మహిళా శ్రామిక భాగస్వామ్యం ఉన్న ప్రపంచ దేశాల సరసన భారతదేశం ఉంది.

(మిగతా రేపటి దిక్సూచిలో)



డా.ఎం.ఎ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, హైదరాబాద్.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

పార్ట్-4

కోడింగ్ - డీకోడింగ్

రీజనింగ్



ఇప్పటివరకు ఈ కోడింగ్-డీకోడింగ్ చాప్టర్‌లో ఒక పదంలోని అక్షరాలు, మరొక అక్షరాలుగా మారే విధానంలో అనేక పద్ధతులను, నెంబర్ కోడింగ్‌కు సంబంధించిన వివిధ పద్ధతులను గత సంచికల్లో తెలుసుకున్నాం. ఈ కోడింగ్-డీకోడింగ్ చాప్టర్‌లో మిగిలిన వివిధ రకాల మోడల్స్‌ను పరిశీలిద్దాం.

డిజిట్ కోడ్

డిజిట్ కోడ్: దీనిలో ఒక పట్టిక, దాని కింద కొన్ని నియమాలు ఇస్తారు. పట్టికలో అంకెలు, వాటి కింద అంగ్ల అక్షరాలు ఉంటాయి. ఇచ్చిన నియమాలను జాగ్రత్తగా అవగాహన చేసుకొని తదనుగుణంగా ఈ కోడింగ్‌కు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించవలసి ఉంటుంది.

డిజిట్	2	5	7	8	9	4	6	3	1
లెటర్ కోడ్	M	R	T	B	W	K	D	N	J

నియమాలు:

1. ప్రశ్నగా ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు బేసి అంకెలు అయితే ఆ రెండు స్థానాలలో I అనే అక్షరం రాయాలి.
2. ప్రశ్నగా ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు సరి అంకెలు అయితే ఆ రెండు స్థానాలలో Y అనే అక్షరం రాయాలి. పై నియమాలు, పట్టిక ఆధారంగా కింది సంఖ్యలకు సరైన కోడ్ అక్షరాలు తెలపండి.

1. 726395కు కోడ్‌ను తెలపండి?
ఎ) IMDNWI బి) YDMNWY
సి) TMDNWR డి) IMDNWR

2. 263847కు కోడ్ తెలపండి?
ఎ) IDNBKI బి) YDNBKY
సి) IDNBKY డి) MDNBKT

3. 591248కు కోడ్‌ను తెలపండి?
ఎ) IWJMKB బి) RWJMKY
సి) YWJMKY డి) RWJMKB

4. 615824కు కోడ్‌ను తెలపండి?
ఎ) IJRBMI బి) IJRBMY
సి) YJRBMY డి) DJRBMK

5. 831796కు కోడ్‌ను తెలపండి?
ఎ) INJTWR బి) BNJTWR
సి) YNJTWY డి) YNJYWY

సమాధానాలు వివరణలతో:

1. సమాధానం: (ఎ)
వివరణ: ప్రశ్నగా ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు బేసి అంకెలు. కాబట్టి మొదటి నియమాన్ని అనుసరించి ఆ రెండు స్థానాలలో I రాయాలి. మిగిలిన అంకెలకు పట్టికలో ఆ అంకె కింద అక్షరమే కోడ్ అవుతుంది.
7 2 6 3 9 5
I M D N W I కాబట్టి సమాధానం (ఎ) అవుతుంది.

2. సమాధానం: (డి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి అంకె సరి అంకె. చివరి అంకె బేసి అంకె అయినందున ఏ నియమం అనుసరించదు. ఆయా అంకెలకు పట్టికలోని అక్షరాలనే కోడ్‌గా భావించాలి.
2 6 3 8 4 7
M D N B K T కాబట్టి సమాధానం (డి) అవుతుంది.

3. సమాధానం: (డి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి అంకె బేసి అంకె, చివరి అంకె సరి అంకె అయినందున ఏ నియమం అనుసరించదు. ఆయా అంకెలకు పట్టికలోని అక్షరాలనే కోడ్‌గా భావించాలి.
5 9 1 2 4 8
R W J M K B కాబట్టి సమాధానం (డి) అవుతుంది.

4. సమాధానం: (సి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు సరి అంకెలు కాబట్టి రెండో నియమాన్ని అనుసరించి ఆ రెండు స్థానాలలో Y రాయాలి. మిగిలిన అంకెలకు పట్టికలో ఆ అంకె కింద అక్షరమే కోడ్ అవుతుంది.
6 1 5 8 2 4
Y J R B M Y కాబట్టి సమాధానం (సి) అవుతుంది.

5. సమాధానం: (సి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు సరి అంకెలు. కాబట్టి రెండో నియమాన్ని అనుసరించి ఆ రెండు స్థానాలలో Y రాయాలి. మిగిలిన అంకెలకు పట్టికలో ఆ అంకె కింద అక్షరమే కోడ్ అవుతుంది.
8 3 1 7 9 6
Y N J T W Y కాబట్టి సమాధానం (సి) అవుతుంది.

ప్రతిక్షేపణ పద్ధతి

ఈ విధానానికి సంబంధించిన ప్రశ్నలలో కొన్ని వస్తువులను మరొక రకమైన వస్తువులుగాను, కొన్ని రంగులను మరొక రంగులుగాను, కొన్ని వాహనాలను మరొక వాహనాలుగాను, పరిగణించే విధంగా కోడ్ ఇస్తారు. తదుపరి ఒక ప్రశ్న ఇస్తారు. ఆ ప్రశ్నకు ముందుగా సరైన సమాధానాన్ని (ఒరిజినల్ ఆన్సర్) అనుకొని దానికి ఏది కోడ్ చేశారో ఆ కోడ్‌ని సమాధానంగా చెప్పాల్సి ఉంటుంది.

1. ఒక కోడ్ భాషలో CARను TRACTOR గాను, TRACTORను BUS గాను, BUSను AUTO గాను, AUTOను VAN గాను పిలుస్తారు. అయితే పొలం దున్నటానికి ఉపయోగించే వాహనం ఏమిటి?
ఎ) BUS బి) CAR సి) TRACTOR డి) VAN
సమాధానం: (ఎ)
వివరణ: సాధారణంగా పొలం దున్నటానికి ఉపయోగించే వాహనం ట్రాక్టర్ (ఇది ఒరిజినల్ ఆన్సర్). కాని ఇక్కడ TRACTORను BUSగా పిలవడం జరిగింది. అనగా దీని అర్థం TRACTORను BUSగా కోడ్ చేయడం జరిగింది. కాబట్టి సమాధానం BUS అవుతుంది.

2. ఒక కోడ్ భాషలో rainను roadగాను, roadను riverగాను, riverను seaగాను, seaను skyగాను, skyను cloudగాను పిలుస్తారు. అయితే విమానాలు ఎక్కడ ఎగురుతాయి?
ఎ) sea బి) cloud సి) road డి) river
సమాధానం: (బి)
వివరణ: విమానాలు ఎల్లప్పుడూ ఆకాశంలోనే ఎగురుతాయి. అంటే ఒరిజినల్ ఆన్సర్ ఆకాశం ఇచ్చిన ప్రశ్నలో ఆకాశాన్ని Cloudగా పిలుస్తారని ఉన్నది. కాబట్టి సమాధానం Cloud అవుతుంది.

3. ఒక కోడ్ భాషలో ఎరుపును ఆకుపచ్చగాను, ఆకుపచ్చను నలుపుగాను, నలుపును పసుపుగాను, పసుపును తెలుపుగాను, తెలుపును ఎరుపుగాను పిలుస్తారు? అయితే పాల రంగు ఏమిటి?
ఎ) నలుపు బి) పసుపు సి) ఎరుపు డి) ఆకుపచ్చ
సమాధానం: (సి)
వివరణ: సాధారణంగా పాల రంగు తెలుపు. (ఒరిజినల్ ఆన్సర్) ఇచ్చిన ప్రశ్నలో తెలుపు రంగును ఎరుపుగా పిలుస్తారని ఉన్నది. కాబట్టి సమాధానం ఎరుపు అవుతుంది.

4. ఒక కోడ్ భాషలో earను eyeగాను, eyeను handగాను, handను mouthగాను, mouthను tongueగాను, tongueను elbowగాను పిలుస్తారు? అయితే మనం ఏదైనా విషయానికి సంబంధించి వినడానికై ఉపయోగించే జ్ఞానేంద్రియం ఏది?
ఎ) eye బి) tongue సి) hand డి) mouth
సమాధానం: (ఎ)
వివరణ: మానవులు వినడానికి ఉపయోగించే జ్ఞానేంద్రియం చెవి (ఒరిజినల్ ఆన్సర్) ఇచ్చిన ప్రశ్నలో చెవిను కన్నుగా పేర్కొన్నారు. కాబట్టి సమాధానం eye అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

నక్సలైట్ టెస్ట్ పేరుతో ఆటవికం

మహిళలను తాకరాని చోట తాకుతూ బలగాల అరాచకం



రఘు మిడియామి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆధార్ లేకుంటే ఆదివాసీ మహిళలకు హింసే
- మహిళలు స్నానాలు చేస్తుంటే.. డ్రోన్లతో వీడియోల చిత్రీకరణ
- రాకెట్ లాంచర్లు, డ్రోన్లతో దాడులు
- అత్యాచారాలు.. కాల్పులతో భయంభయం
- 'ఆంధ్రజ్యోతి'తో.. ఎంబీఎం, బీజేసీఎస్ నేత రఘు మిడియామి

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): "ఛత్తీస్‌గడ్ అడవుల్లో పోలీసు బలగాలు ఆటవిక ప్రవర్తనతో పేట్రేగిపోతున్నాయి. నక్సలైట్ల పేరుతో మూలవాసీ, ఆదివాసీ మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నాయి. ఆధార్ కార్డు లేకపోతే.. తునికాకు సేకరణకు వెళ్లే మహిళలను నక్సలైట్ టెస్ట్ పేరుతో పాశవికంగా హింసిస్తున్నాయి. నక్సలైట్ టెస్ట్ అంటే.. మహిళలను తాకరాని చోట తాకడం.. ఈ పరీక్షలో మహిళ వక్షోజాల నుంచి పాలు వస్తే నక్సలైట్ కాదని, రాకుంటే నక్సలైట్ అని బలగాలు భాష్యం చెబుతున్నాయి. అడవుల్లో రెండేసి కిలోమీటర్లకు ఒకటి చొప్పున క్యాంపులను ఏర్పాటు చేసుకున్న కేంద్ర బలగాలు అరాచకాలు అన్నీఇన్నీ కావు" అని మూలవాసీ బచావో మంచ్(ఎంబీఎం), బస్తర్ జనసంఘర్ష్ సమన్వయ సమితి(బీజేసీఎస్) అధ్యక్షుడు రఘు మిడియామి వాపోయారు. ఎక్కడో మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న హింసపై యావత్ దేశం ఎలుగెత్తిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న దారుణాలకు సంఘీభావం తెలిపేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దండకారణ్యంలో మారణహోమం, కేంద్ర బలగాలు చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలంటూ ఈ నెల 18న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌరహక్కుల సంఘం, ప్రజాస్వామిక హక్కుల సంఘాలు నిర్వహించిన కార్యక్రమంలో రఘు మిడియామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

సిలెంగురు స్మృతిదినం జరపనివ్వలేదు

ఆదివాసీల అక్రమ అరెస్టు, బూటకపు ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ 2021 మే 10న మేం పోరాటాలను ప్రారంభించాం. ప్రశాంత జీవనాన్ని కోరుకున్నాం. అటవీ వనరుల ప్రైవేటీకరణను, మావోయిస్టుల పేరుతో సైనికీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాం. 2021 మే 10న సిలెంగురులో జరిగిన పోరాటం సందర్భంగా పోలీసులు కాల్పులు జరిపారు. మా సంఘాలకు చెందిన ముగ్గురు సభ్యులను పొట్టనబెట్టుకున్నారు. వారి మృతికి గుర్తుగా ఏటా మే 9, 10 తేదీల్లో సిలెంగురు స్మృతిదినం జరుపుకొంటున్నాం. ఈ ఏడాది మాత్రం పోలీసులు అనుమతుల్లేవంటూ అడ్డుకున్నారు. అయితే.. జూన్ 9, 10 తేదీల్లో స్మృతిదినాన్ని నిర్వహించి తీరుతాం.

ప్రభుత్వాలు మారినా..

ప్రభుత్వాలు మారినా.. మా తలరాతలు మారడం లేదు. మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్లన్నీ మూలవాసీలు, ఆదివాసీలకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. అడవి బిడ్డలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రాజ్యాంగం కల్పించిన హక్కులు మాకు వర్తించకుండా చేస్తున్నారు. రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛను హరించినప్పుడే విప్లవం పురుడుపోసుకుంటుంది. ఇప్పుడు ఛత్తీస్‌గడ్ ఆదివాసీలు, మూలవాసీల్లో అది మొదలైంది. మా అడవుల్లో మేం బతకాలంటే.. 'రణమా..? మరణమా..??' అన్నట్లుగా పరిస్థితులు మారిపోయాయి. దీంతో మేం ఎంబీఎం, బీజేసీఎస్‌లను స్థాపించాం. పోరాడుతున్నాం. మాపైనా కేంద్ర బలగాల బెదిరింపులు పెరిగాయి. అరెస్టులు పెరిగాయి. భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మా సమస్యలేమిటి? పోరాటం ఎందుకు? అనేది తెరమీదకు, జనం మధ్యకు రాకుండా కేంద్ర బలగాలు ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. మాపైన మావోయిస్టు ముద్ర వేస్తున్నాయి. బూటకపు ఎన్‌కౌంటర్లలో అమాయకులైన ఆదివాసీలు, మూలవాసీలను హతమారుస్తూ.. అక్కడ ఎలాంటి సమస్యల్లేవంటూ బయటి ప్రపంచానికి చెబుతున్నాయి. అందుకే మా సమస్యలేంటో చెప్పుకోవడానికి హైదరాబాద్ వచ్చాం. దయచేసి మీడియా మిత్రులు మా ప్రాంతాలను సందర్శించాలి. మా ఇబ్బందులేమిటో మీకు అర్థమవుతాయి.

సహజ వనరుల కోసమే..

ప్రభుత్వాలు ఆదివాసీలు, మూలవాసీల పట్ల బలగాలతో ఇంత కర్కశంగా దాడులు చేయించడానికి కారణం.. అడవుల్లో ఉన్న సహజ వనరులు, నిక్షేపాల కోసమే. బస్తర్, సుక్మా, కాంకేర్, దంతేవాడ, నారాయణపూర్, బీజాపూర్.. ఇలా పలు ప్రాంతాల్లో 28 రకాల నిక్షేపాలున్నాయి. మైనింగ్‌తో ఆ ఖనిజ సంపదను కార్పొరేట్‌కు కట్టబెట్టాలనేదే ప్రభుత్వాల ఆలోచన. ఆ ప్రయత్నాలకు మేం అడ్డుగా ఉన్నాం. మావోయిస్టులు కూడా ఎప్పటికప్పుడు ఆ ప్రయత్నాలను అడ్డుకుంటున్నారు. అందుకే మమ్మల్ని అడవులను ఖాళీ చేసి వెళ్లేలా చేస్తున్నారు. మా అడవుల్లో 'మురియా' వంటి అంతరించిపోతున్న గిరిజన తెగలు(పీవీటీజీ) ఉన్నాయి. గిరిజనులు.. ప్రత్యేకించి పీవీటీజీల పరిరక్షణకు రాజ్యాంగం, చట్టాలు ఉన్నాయి. అయినా.. ప్రభుత్వాలు ఇలా మాపై కక్షకట్టడం బాధాకరం. మా సంపదను కొల్లగొట్టేందుకు ఇప్పటికే కొన్ని కంపెనీలు అడవుల్లో తిష్టవేశాయి. అయితే.. చదువుకున్న ఆదివాసీలకు ఉపాధి కల్పించడంలో ఆ కంపెనీలు ఆసక్తి చూపడం లేదు. గడిచిన పాతికేళ్లలో 10 వేల మంది ఆదివాసీలు, మూలవాసీలను అరెస్టు చేశారు. పలువురిని బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి, కాల్చిచంపారు.

మహిళల నగ్న వీడియోల కోసమా?

ఆధార్ లేకుంటే.. మా అడవుల్లో తిరగడానికి మేం అర్హులం కాదని బలగాలు హుకుం జారీ చేశాయి. ఆధార్ లేకుంటే.. మావోయిస్టుల ముద్ర వేసి, ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తునికాకు సేకరణకు వెళ్లే మహిళలకు నక్సలైట్ టెస్టులు పెడుతున్నారు. మహిళలు స్నానం చేస్తుంటే.. డ్రోన్ కెమెరాలతో నగ్న దృశ్యాలను చిత్రీకరిస్తున్నారు. ఆ వీడియోలను చూపుతూ.. మా వాళ్లు ఇంటి నుంచి బయటకు రాకుండా చేస్తున్నారు. అత్యాచారాలు, బూటకపు ఎన్‌కౌంటర్లు, కాల్పులు, రాకెట్ దాడులతో ప్రశాంత అడవులు మోతెత్తిపోతున్నాయి. అడవులే మా నివాసాలు. మావోయిస్టుల పేరుతో మమ్మల్ని అడవుల్లోంచి వెళ్లగొడుతున్నారు. ఈ మధ్య జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు చనిపోయారని పోలీసులు ప్రకటించుకున్నారు. నిజానికి ఆ చనిపోయిన వారిలో ఇద్దరు మాత్రమే నిరాయుధులైన నక్సలైట్లు. మిగతావారంతా తునికాకు సేకరణకు వెళ్లినవారే.

క్యాంపులతో అరాచకాలు

గతంలో రహదారులు, సరిహద్దుల వెంబడి సీఆర్పీఎఫ్ క్యాంపులు ఉండేవి. ఇప్పుడు గ్రామాల్లోకి చొచ్చుకువచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కోసం నిర్మించిన భవనాల్లో తిష్టవేస్తున్నారు. రోడ్లపైనా ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక క్యాంపును పెట్టారు. క్యాంపుల్లోని బలగాలు ఆదివాసీలపై చేస్తున్న అరాచకాలు అన్నీఇన్నీ కావు. గ్రామాల్లోకి వచ్చి, బలవంతంగా డబ్బులు లాక్కెళ్తున్నారు. పూటుగా తాగి.. కాల్పులు జరుపుతున్నారు. ఇలా జరిపిన కాల్పుల్లో ఇటీవల ఆరు నెలల వయసున్న ఓ చిన్నారి మరణించింది. ఏళ్ల తరబడి ఏర్పాటు చేస్తున్న బేస్‌క్యాంపుల కోసం మొత్తం 2 లక్షలకు పైగా చెట్లను నరికేశారు.

దక్షిణ అండమాన్‌కు 'నైరుతి'



విజయవాడ పటమట ప్రాంతంలో మబ్బులు కమ్మేసిన దృశ్యం

(మొదటి పేజీ తరువాయి)

పడమర, నైరుతి గాలులు బలంగా వీయడం, భారీగా తేమ మేఘాలు ఆవరించడం, శనివారం నుంచి నికోబార్ దీవుల్లో వర్షాలు కురవడం వంటి అంశాలను పరిగణనలో తీసుకుని నైరుతి రుతు పవనాలు ప్రవేశించాయని ఐఎండీ నిర్ధారించింది. కాగా, ఈనెల 22వ తేదీన నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. తర్వాత అది ఈశాన్యంగా పయనించి 24వ తేదీ కల్లా మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడుతుందని ఐఎండీ తెలిపింది. 24వ తేదీ తర్వాత అది మరింత బలపడి తుఫాన్‌గా మారి ఒడిశా తీరం దిశగా వచ్చే అవకాశం ఉందని ఇస్రో వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఈనెల 22వ తేదీ తర్వాత దీనిపై మరింత స్పష్టత వస్తుందన్నారు. కాగా, తమిళనాడు పరిసరాల్లో ఆవర్తనం, మహారాష్ట్ర నుంచి తమిళనాడు వరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో ఈనెల 23వ తేదీ వరకు దక్షిణ భారతంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. కర్ణాటక కోస్తా ప్రాంతంలో ఈనెల 20, 21 22 తేదీలు, దక్షిణ కర్ణాటకలో 21, 22 తేదీలు, లక్షద్వీప్‌లో 20, 21 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. 20, 21, 22 తేదీల్లో తమిళనాడు, పుదుచ్చేరి, కరైకాల్, కేరళ, మాహే ప్రాంతాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, లక్షద్వీప్, దక్షిణకర్ణాటక, ఏపీ, తెలంగాణ, యానాం, సబ్-హిమాలయన్ పశ్చిమబెంగాల్, సిక్కింలలో వచ్చే ఏడురోజులు ఉరుములు, మెరుపులు, పిడుగులు, బలమైన గాలులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షం.. పిడుగులు.. నేడూ కొనసాగే అవకాశం

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం ఈదురు గాలులు, పిడుగులతో కూడిన వర్షాలు కురిశాయి. దాదాపు 47 ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడ్డాయి. పెదకూరపాడులో 55.5, వత్సవాయిలో 40, జగ్గయ్యపేటలో 39.5, అడ్డతీగలలో 38, చింతలపల్లిలో 36, అనపర్తిలో 35.2, రావికమతంలో 35.7, రాజవొమ్మంగిలో 35, బిక్కవోలులో 31 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం మన్యం, అల్లూరి, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, అనంతపురం, సత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. మరోవైపు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరు జిల్లాల్లోని 24 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

నకిలీ ఇంటర్వ్యూలు, నియామక పత్రాలు

- రైల్వే ప్రభుత్వ ఉద్యోగాల పేరిట భారీ మోసం
- లక్షలు వసూలు చేసి ఉడాయిస్తున్న మోసగాళ్లు
- రైల్ నిలయం వేదికగా కార్యకలాపాలు
- సహకరిస్తున్న కొందరు సిబ్బంది, అధికారులు

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ఉద్యోగాలిప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసే ముఠాలకు దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం రైల్ నిలయం అడ్డాగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మోసగాళ్ల వలలో చిక్కుకుని పలువురు నిరుద్యోగులు లక్షలాది రూపాయలు పోగొట్టుకొని లబోదిబోమంటున్నారు. సికింద్రాబాద్ కేంద్రంగా పరిపాలన కార్యకలాపాలు నిర్వహిస్తున్న రైల్ నిలయంలో పని చేస్తున్న కొంత మంది కిందిస్థాయి సిబ్బంది, అధికారులు ఈ మోసగాళ్లతో కుమ్మక్కైనట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీరి మోసాలను అడ్డుకునే యంత్రాంగం లేకపోవడంతో అమాయకులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాట్సాప్ గ్రూపులు, వెబ్‌సైట్ల నుంచి నిరుద్యోగుల ఫోన్‌నెంబర్లు సేకరించి మోసగాళ్లు వల విసరుతున్నారు. రైల్వేతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలు విభాగాల్లో ఖాళీలను, బ్యాక్‌లాగ్‌లను భర్తీ చేస్తున్నారని మభ్యపెడుతున్నారు. ఆయా సంస్థల పేరిట నకిలీ లేఖలు సృష్టించి ఇంటర్వ్యూలు నిర్వహించి, హాజరైనవారికి నకిలీ నియామక పత్రాలు కూడా అందించటం విశేషం. రూ.10-15 లక్షల వరకు వసూలు చేసుకొని ఉడాయిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాలకు సంబంధించిన నిరుద్యోగులను కూడా వీరు మోసగించినట్లు తెలుస్తోంది. రైల్వేలో టీటీఈ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికిన ముఠా సభ్యులు హైదరాబాద్ కందికల్ భట్‌జీనగర్ ప్రాంతంలోని ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.12 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. అయితే, రైల్వేలో టీటీఈ ఉద్యోగ నియామకాలు జరగడం లేదని ఆ అభ్యర్థి తెలుసుకొని వారిని నిలదీయటంతో, వాళ్లు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా.. రైల్వేలో లేదు కానీ, కావాలంటే తమిళనాడు రాష్ట్ర ఏజీ (అకౌంటెంట్ జనరల్) కార్యాలయంలో ఎల్‌డీసీ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పారు. ఈ మేరకు ముఠా సభ్యుడు అనిల్‌కుమార్ ఓ ఫేక్ లెటర్‌తో చెన్నైలో సదరు నిరుద్యోగికి ఇంటర్వ్యూ ఏర్పాటు చేశాడు. నాలుగు రోజుల పాటు అక్కడే ఉంచి 'నియామకపత్రాన్ని' కూడా అందించాడు. ఒప్పందం మేరకు డబ్బులు తీసుకున్నాడు. రెండు వారాలవ్యవధిలో ఉద్యోగంలో చేరడానికి మళ్లీ సమాచారం ఇస్తామని చెప్పి పంపించారు. కానీ, నెల గడిచినా సమాచారం లేకపోవడంతో బాధితుడు.. తమిళనాడు ఏజీ కార్యాలయానికి వెళ్లి చూపగా అది నకిలీదని తేలింది. అనిల్‌కుమార్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో మోసపోయినట్టు తెలుసుకుని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది ఈ ఒక్క వ్యక్తికే పరిమితం కాలేదని, ఆదాయపన్ను శాఖలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్స్ రైల్వేలో క్లర్క్, టీటీఈ తదితర ఉద్యోగాల పేరిట నిరుద్యోగుల నుంచి ఈ ముఠా భారీ మొత్తంలో వసూలు చేసినట్టు సమాచారం.



బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో ఆందోళన చేస్తున్న మహిళలు

అమరావతిని అంగుళం కూడా కదపలేరు

● 1615వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మే 19: దగాకోరు వైసీపీ ప్రభుత్వం తమకొద్దని, ఇంటికి పంపటానికే ప్రజలు క్యూలో ఓట్లు వేయటానికి బారులు తీరారని రాజధాని అమరావతికి 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు, నిరసనలు ఆదివారం నాటికి 1615వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రాజధాని రైతులు మాట్లాడుతూ, అమరావతి రాజధాని అని గత ఎన్నికల ముందు వైసీపీ సహా అన్ని రాజకీయ పార్టీలు ఆమోదించాయని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే సీఎం జగన్‌రెడ్డి అమరావతిని ఎలాగైనా నాశనం చేయాలనే సంకల్పంతో పాలన చేశారన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో ఓడిపోతున్నాడని స్పష్టం చేశారు. మోసం కొంత కాలమే చెల్లుతుందన్నారు.ప్రభుత్వాలు మారుతుంటాయి.. రాజధాని అమరావతి శాశ్వతమన్నారు. పార్లమెంట్ చేసిన విభజన చట్టంలోనే అది ఉందన్నారు. తొమ్మిదేళ్లుగా అమరావతి రాజధానిగా చేసుకొని పరిపాలన రెండు ప్రభుత్వాలు సాగించాయన్నారు. అటువంటప్పుడు అమరావతిని అంగుళం కూడా కదలదన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలలో రైతు ఆందోళనలు కొనసాగుతున్నాయి.



గొంది కూనయ్య (ఫైల్‌ఫోటో)

రైలు కిందపడి కార్పెంటర్ మృతి

వేమూరు, మే 19: కాలుజారి రైలు కిందపడి వ్యక్తి మృతి చెందాడు. శనివారం రాత్రి వేమూరు రైల్వేస్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. మండలంలోని జంపని గ్రామానికి చెందిన కార్పెంటర్ గొంది కూనయ్య(45) పని నిమిత్తంగా తన తోటి కార్పెంటర్లతో కలసి శనివారం రాత్రి వేమూరులో డెల్టా ట్రైన్ ఎక్కుతున్నాడు. కాలుజారి రైలు కిందకు జారిపడ్డాడు. రైలు ముందుకు కదలడంతో కూనయ్య తీవ్రంగా గాయాల పాలయ్యాడు. తోటి మిత్రులు రైలును ఆపించి స్టేషన్ అధికారులకు సమాచారం తెలిపారు. రైల్వే పోలీసులు తెనాలి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమంగా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ప్రారంభంలోనే మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తంగా ఆసుపత్రికి తరలించారు. కూనయ్యకు తల్లి, తండ్రి ఉన్నారు. వివాహం కాలేదు.

గ్రామాల్లో.. కార్డెన్ సెర్చ్

● కొనసాగుతున్న పోలీసు తనిఖీలు



బొల్లాపల్లి: పేరూరుపాడులో ఇళ్లలో సోదాలు చేస్తున్న పోలీసు సిబ్బంది



బెల్లంకొండ: నాగిరెడ్డిపాలెంలో తనిఖీలు చేపడుతున్న ఎస్ఐ రాజేష్

మాచర్లటౌన్, రెంటచింతల, కారంపూడి, రాజుపాలెం, దుర్గి, బెల్లంకొండ, బొల్లాపల్లి, మే 19: పల్నాడు పోలింగ్ విధ్వంసాలపై ఒకవైపు సిట్ విచారణ జరుగుతుండగా మరోవైపు పోలీసులు తనిఖీలను కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో కార్డెన్‌సెర్చ్ నిర్వహించి అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో పోలీసులు గ్రామంలోకి రావడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురయ్యారు. గ్రామానికి నలువైపులా తనిఖీలు చేపట్టి గ్రామంలో ఉన్నవారిని బయటకు వెళ్లకుండా బయటవారిని గ్రామంలోకి రానివ్వకుండా కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. గృహాలు, శిథిలావస్థలో నిరుపయోగంగా ఉన్న గృహాలు, వాముల్లో, కొష్టాల్లో, పొదల్లో సోదాలు చేశారు. ఆదివారం తెల్లవారుజామున జరిపిన కార్డెన్‌సెర్చ్‌లో ఆధారాలు లేని ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనుమానిత ప్రాంతాల్లో నిఘాతో పాటు ఎక్కడికక్కడ పికెట్లలోనూ తనిఖీలు కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో సమస్యాత్మక గ్రామాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆదివారం తెల్లవారుజామున ప్రత్యేక బలగాలతో మాచర్ల మండలం కంభంపాడులో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మారణాయుధాలు, కర్రలు, రాడ్లు, కంకరరాళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి సోదాలు చేశారు.

● కారంపూడి మండలం పేటసన్నిగండ్లలో సీఐ నారాయణస్వామి ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం కార్డెన్ సెర్చ్ జరిగింది. మండలంలోని ప్రతి గ్రామాన్ని తనిఖీ చేస్తున్నామని, రికార్డులులేని రెండు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వైసీపీకి చెందిన ఇద్దరు, టీడీపీకి చెందిన ఒకరిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వేర్వేరుగా విచారించి పంపారు.

● రెంటచింతలకు కేంద్ర బలగాలను రప్పించారు. ఇప్పటికే 151 మంది పోలీసులు, ఒక స్ట్రైకింగ్ ఫోర్స్ బలగాలు ఉన్నాయి. ఎన్నికల ఫలితాల వెల్లడి గడువు సమీపిస్తున్న తరుణంలో ఒక కంపెనీ కేంద్ర బలగాలైన సీఐఎస్ఎఫ్ ఆదివారం రాత్రి రెంటచింతలకు చేరుకుంది.

● రాజుపాలెం మండలం నెమలిపురి గ్రామంలో ఎస్ఐ షామీర్‌బాషా, సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. ఎవరైనా గొడవలకు, దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

● దుర్గి మండలం మించాలపాడులో ఆదివారం సుమారు 45మంది పోలీసు బృందంతో డీఎస్పీ రామకృష్ణాచారి, ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్ఐలు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డు లేని 11 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు.

● బొల్లాపల్లి మండలం పేరూరుపాడు గ్రామంలో బందోబస్తు కొనసాగిస్తున్నారు. ఆదివారం రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ చెన్నకేశవులు, ఈపూరు ఎస్ఐ ఫిరోజ్‌ల ఆధ్వర్యంలో గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని జల్లెడ పట్టారు.

● బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెంలో ఆదివారం తెల్లవారుజామున రూరల్ సీఐ మంగారావు, ఎస్ఐ రాజేష్ పర్యవేక్షణలో 40 మంది పోలీసులు కార్డెన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు.



మాచర్ల మండలం కంభంపాడులో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు



దుర్గి మండలం మించాలపాడులో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు



రాజుపాలెం: నెమలిపురిలోని ఇంటిలో తనిఖీలు చేస్తున్న పోలీస్ సిబ్బంది

అల్లర్ల వెనుక వైసీపీ

● ఓటమి భయంతోనే దాడులు
● సీ పీ ఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ
● సిట్‌తో ఒరిగేదేమి లేదంటూ వ్యాఖ్యలు

గుంటూరు(తూర్పు), మే19: రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న అల్లర్ల వెనుక వైసీ ఎ పాత్ర ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ వ్యాఖ్యానించారు. ఆదివారం, గుంటూరు కొత్తపేట మల్లయ్య లింగం భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటమిని ఊహించి వైసీపీ నాయకులు ఈ దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారిపోయారన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన సిట్‌తో ఎటువంటి ఉపయోగం ఉండదన్నారు. ఫలితాలు వరకు విచారణ సాగదీసి, గెలిచిన పార్టీ చెప్పినట్టు నివేదికను రూపొందిస్తారని విమర్శించారు. కేవలం జగన్ వైఫల్యాల వల్లనే కూటమి అధికారంలోకి వస్తుందే తప్ప బీజేపీ వల్ల కాదన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో పాటు అనేక ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో జగన్ ఓటమి పాలవుతున్నాడన్నారు. టిడ్కో ఇళ్ల పంపిణీ చేయకపోవడం దారుణమన్నారు. ఎదురుకాళ్లతో పుట్టాడేమో.. అందుకే జగన్ రివర్స్ పాలన చేశాడని ఘాటుగా విమర్శించారు. యువత, మహిళలు, ఉద్యోగులు వెనుక ఉండటంతో చంద్రబాబు అధికారంలోకి వస్తున్నాడని స్పష్టం చేశారు. అలాగే కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని జోస్యం చెప్పారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ కౌంటింగ్ ప్రకియకు ముందే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని ఆ పదవి నుంచి తొలగించాలన్నారు. లేదంటే ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తాడని ఆరోపించారు. వైసీపీ నాయకులు పిన్నెల్లి సోదరుల వల్లే పల్నాడులో అశాంతి నెలకొన్నదన్నారు. తక్షణమే పిన్నెల్లి సోదరులను అదుపులోకి తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ సమర్థంగా పనిచేయాలన్నారు. జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సహకరించిన ప్రజలకు, ఇండియా కూటమి కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కోటా మాల్యాద్రి. మేడా హనుమంతురావు, నాసర్‌జీ, వలి, అకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కే నారాయణ, పాల్గొన్న ముప్పాళ్ల తదితరులు

దిగిపోయే ముందు వైసీపీ చేతివాటం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్, మే 19: దిగి పోయే ముందు కాంట్రాక్టర్లకు ప్రభుత్వ పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో అధికార వైసీపీ చేతివాటానికి పాల్పడుతుందని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. బినామి కాంట్రాక్టర్లకు తొలి ప్రాధాన్యం, కమిషన్‌లు ఇచ్చే సొంత కాంట్రాక్టర్లకు రెండో ప్రాధాన్యంగా వేలకోట్లు చెల్లిస్తున్నా జగన్‌రెడ్డి వారికి ఖజానా మొత్తం దోచి పెడుతున్నారని దుయ్య బట్టారు. ఇప్పటికే ఫైనాన్స్ కమిషన్ ద్వారా పంచాయతీలకు చెల్లించాల్సిన నిధులను దారి మళ్ళించి అప్పులు, బాండ్ల రూపంలో తెచ్చిన వేల కోట్లను కూడా అయినవారికే పంచి పెడుతున్నారని, వాస్తవానికి సంక్షేమ పథకాలకు జమ చేయగా మిగిలిన నిధులన్నీ ఉద్యోగులకు, పంచాయతీలకు, ఆరోగ్యశ్రీ కింద ఆస్పత్రులకు చెల్లించాల్సి ఉందని, కాని అవన్నీ పక్కన పెట్టి నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడ కమిషన్‌లు వస్తాయో చూసి వారికే చెల్లింపులు చేస్తున్నారని, దీన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎలాగూ ఓటమి తప్పదని తెలిసే ఇలా ఉన్నదంతా ఊడ్చేసే పని పెట్టుకున్నారని, దీనిపై తెలుగుదేశం పార్టీ తరపున గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేశామని, వైసీపీ రాజకీయ స్వార్థం కోసం చేసే ఇటువంటి పనులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. ఎన్నికల కోడ్‌కు ముందు నుంచే ఇలా సొంత కాంట్రాక్టర్లకు సంతర్పణ కార్యక్రమం పెట్టుకున్న ముఖ్యమంత్రి చివరకు పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పీఎఫ్, మెడికల్ బిల్లుల రీయింబర్స్‌మెంట్ వంటివి కూడా చెల్లించక పోవటం దారుణమన్నారు. వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకు పోయిన ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల సేవలు నిలిపివేసే దుస్థితికి తెచ్చారని, ఇలాగే మరెన్నో అత్యవసర సేవలకు కూడా నిధులు ఆపివేసి సొంత జేబులు నింపుకోవటం మరీ దుర్మార్గపు దోపిడీగా కన్పిస్తుందని ప్రత్తిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చెల్లింపులతో పాటు ప్రతి వ్యవహారంలో జగన్ చెప్పినట్టుగా ఆడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని ఎన్నికల సంఘం ఇకనైనా సాగనంపాల్సిన అవసరం ఉందన్నారు. అసలు ఇందు కోసమే జగన్ ప్రభుత్వం అతడిని ఇంత కాలం కాపాడుకుంటూ వచ్చినట్లు ఉందని, ఇకనైనా ఆయనతో పాటు ఆర్థిక శాఖలో దారి తప్పిన అధికారుల పై వేటు వేస్తే మేలన్నారు.

రైళ్ల రద్దు.. ప్రయాణికుల ఇక్కట్లు

● వేసవిలో రెగ్యులర్‌తో పాటు గతంలో స్పెషల్స్ నడిచేవి
● నేడు స్పెషల్స్ మాట దేవుడెరుగు... నిత్యం బయలుదేరే రైళ్లకే దిక్కు లేదు
● అవసరమైతే కొన్ని స్టాపులు తీసేసి నడపాలంటున్న ప్రయాణీకులు

గుంటూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): తరచుగా రెగ్యులర్, ప్రత్యేక రైళ్ల రద్దుతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మూడు, నాలుగు నెలల క్రితం చేసుకొన్న ప్రయాణ ప్రణాళిక అంతా తారుమారు అయిపోతుండటంతో అప్పటికప్పుడు ప్రత్యామ్నాయం చూసుకోలేక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ముఖ్యంగా వేసవి సెలవుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లి వచ్చేందుకు బుకింగ్ చేసుకొన్న రైల్వే టిక్కెట్‌లు రద్దు అవుతుండటం ప్రయాణికులను రైల్వేపై అసహనానికి గురి చేస్తున్నది. ఇలాంటి రద్దులతో ప్రయాణికులను రైళ్లకు దూరం చేయాలని కేంద్రం వ్యూహంగా కనిపిస్తోన్నదని పలువురు ఆరోపిస్తున్నారు. గుంటూరు నుంచి బయలుదేరే మూడు ప్రధాన రైళ్లు గత కొన్ని రోజులుగా రద్దు చేస్తుండటంతో ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు.

గుంటూరు నుంచి బయలుదేరే రైళ్లలో కొన్నింటిని ఆగస్టు వరకు కూడా రద్దు చేశారు. మరికొన్నింటిని జూన్ నెల వరకు రద్దు చేశారు. వాటి తేదీలను పొడిగించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఏటా వేసవికాలంలో ప్రయాణికుల రాకపోకలు పెరుగుతుంటాయి. ఇందుకు కారణం సెలవుల్లో వేరే ప్రాంతాలకు వెళ్లి అక్కడ కొన్ని రోజులు బస చేసి తిరిగి వస్తుంటారు. కొందరైతే పర్యాటక ప్రాంతాలకు వెళుతుంటారు. ఈ కారణంగా రెగ్యులర్ రైళ్లకు అదనపు బోగీలు ఏర్పాటు చేయడంతో పాటు డిమాండ్‌ని బట్టి ప్రత్యేక రైళ్లను నడిపి ప్రయాణికుల అవసరాలను రైల్వే శాఖ గతంలో తీర్చేది. అలాంటిది ఇప్పుడు రద్దుల బాట పట్టింది. గుంటూరు నుంచి బయలుదేరే రైళ్లలో గోల్కొండ, సింహాద్రి, రాయగడ ఎక్స్‌ప్రెస్‌లు ముఖ్యమైనవి. వీటిల్లో అన్నివర్గాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. అలాంటిది గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 16వ తేదీ నుంచి ఆగస్టు 10 వరకు రద్దు చేశారు. అలానే న్యూగుంటూరు నుంచి తిరుపతికి వెళ్లేవారు ఎక్కువగా డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుంటారు. వారంలో మూడు రోజుల పాటు ప్రయాణించే ఈ రైలుని కూడా ఆగస్టు 10వ తేదీ వరకు రద్దు చేశారు. మధ్యాహ్నం ప్రయాణించే రైళ్లలో నెంబరు. 12806/12805 లింగంపల్లి - విశాఖపట్టణం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఒకటి. దీనిని జూన్ 24 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు రద్దు చేస్తూ రైల్వే శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. నెంబరు. 17239/17240 గుంటూరు - విశాఖపట్టణం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ని కూడా ఆగస్టు 10వ తేదీ వరకు రద్దు చేశారు. విశాఖపట్టణం - గుంటూరు - విశాఖపట్టణం ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ది కూడా ఇదే వరస. ఈ రైలుని కూడా ఆగస్టు 10వ తేదీ వరకు రద్దు చేశారు.

ఇక చిరుద్యోగులు, విద్యార్థులు, కార్మికులు ప్రయాణించే సర్క్యులర్ రైళ్లు, వాటికి రేక్ షేరింగ్ ఉన్న ఇతర ప్రాంతాల రైళ్లను రద్దు చేయడం వలన వారు తీవ్రంగా నష్టపోతున్నారు. నిత్యం గుంటూరు - విజయవాడ - తెనాలి మధ్యన సర్క్యులర్ రైళ్లు నడుస్తుంటాయి. అలానే గుంటూరు - మాచర్ల, గుంటూరు-డోన్ రైళ్లను కూడా రైల్వే శాఖ రద్దు చేసింది. దీంతో ఆయా వర్గాల ప్రయాణికులు బస్సుల్లో పని ప్రదేశాలకు వెళ్లి తిరిగి ఇళ్లకు చేరుకోవాల్సి వస్తుండటంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల చాలామంది భక్తులు నర్మద నది పుష్కరాలకు వెళ్లేందుకు మూడు నెలల ముందుగానే టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోగా తీరా వారి ప్రయాణం దగ్గర పడే సందర్భంలో ఇండోర్ వెళ్లే రైళ్లను రద్దు చేశారు. దాంతో వారంతా సికింద్రాబాద్, వైజాగ్ నుంచి వేరే రైళ్లలో తత్కాల్, ప్రీమియం తత్కాల్ కోటాలో టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొని వెళ్లాల్సి వచ్చింది. సహజంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చరల్ మెయిన్‌టెనెన్స్ పనులు ఉదయం పూట నిర్వహిస్తుంటారు. అదేంటో ఈ పేరుతో రాత్రి వేళ ప్రయాణించే రైళ్లను కూడా రద్దు చేస్తుండటానికి కారణం తెలియని పరిస్థితి. ప్రస్తుతం గుంటూరు నుంచి బయలుదేరే/మీదగా ప్రయాణించే 29 రైళ్లను రైల్వే శాఖ రద్దు చేయడంతో ప్రయాణికులు లేక రైల్వేస్టేషన్లు వెలవెలబోతున్నాయి. కాగా పనులకు అడ్డం వస్తున్నాయనుకొంటే కొన్ని స్టాపులు తొలగించి అయినా రెగ్యులర్ రైళ్లను నడపాలని ప్రయాణికుల వినియోగదారుల సంఘాల నాయకులు రైల్వేని కోరుతున్నారు.

కంద సాగుకు.. సమాయత్తం

● గత ఏడాది ఆశాజనకంగా కంద ధరలు
● క్వింటా రూ.10 వేలు పలికిన ధర
● కంద సాగు వైపు రైతులు మొగ్గు



మెట్ట భూముల్లో కంద విత్తుతున్న కూలీలు

కొల్లూరు, మే 19: గత ఏడాది ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు కంద సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. కొల్లూరు మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంతంలోని లంక గ్రామాల్లో రైతులు కంద విత్తనాన్ని విత్తుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ఎకరా కౌలు రూ.50 నుంచి 60 వేలు చెల్లించి మరి కంద సాగు చేపట్టారు. ఎకరాకు 20 పుట్లు విత్తనం అవసరం కానుంది. మంచి ధరలు పలికిన విత్తనం కోసం తమ వద్ద ఉంచుకున్న కంద దుంపలను విత్తుకుంటున్నారు. ప్రస్తుతం కంద విత్తనం ధర రూ.10 వేల నుంచి 11 వేలు వరకు పలుకుతుందని రైతులు చెబుతున్నారు. కంద విత్తేందుకు ఎకరాకు రూ.5 వేలు కూలీ చెల్లిస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు. విత్తనం కొని సాగు చేస్తే రైతుకు ఈ ధర మీద ఏమీ మిగలదని విత్తనం ఉన్న రైతులు కంద పంట సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. విత్తిన అనంతరం మళ్లీ పంట చేతికొచ్చే వరకు ఎకరాకు రూ.15-29 వేలు వరకు పెట్టుబడి అవసరం అవుతాయని, కంద బాగా ఊరితే 50 నుంచి 60 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుందని, గతంలో సుమారు 90-100 క్వింటాళ్ల దిగుబడి చూసేవారమని, ప్రస్తుతం ఆ దిగుబడులు రావడం లేదని చెబుతున్నారు. పైగా వ్యవసాయ ఖర్చులు మాత్రం ప్రతి ఏడాది పెరుగుతుందని, తాము పండించిన పంటలకు మాత్రం గిట్టుబాటు ధరలు లభించడం లేదని, ఈ ఏడాది తొలినాళ్లలోనే కంద, పసుపు పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో పాటు ధరలు కూడా మంచిగా ఉన్నట్లుగా రైతులు అంటున్నారు. ఈ ధరలు ఇలాగే ఉంటే గతంలో నష్టపోయిన రైతులు కొంత మేరకు కోలుకునే వెసులుబాటు కలుగుతుందని చెబుతున్నారు.



కంద విత్తనం నాటేందుకు ముక్కలు చేస్తున్న కూలీలు

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

జిల్లా జైలులో ఖైదీలకు జిల్లా జడ్జి సూచన



జిల్లా జైలులో మహిళా ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి పార్థసారథి

గుంటూరు, మే 19: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలిగి మంచి జీవితాన్ని అలవర్చుకోవాలని జిల్లా జడ్జి వై.వి.ఎస్.జి. పార్థసారధి సూచించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా న్యాయ సహాయ సంస్థ కార్యదర్శి టి. లీలావతితో కలసి ఆయన గుంటూరు జిల్లా జైలును సందర్శించారు. సందర్శనలో భాగంగా వంటశాలను, రేషన్ స్టోర్‌ను, ఖైదీల కోసం సిద్ధం చేసిన ఆహారాన్ని పరిశీలించారు. ప్రతి ఖైదీతో మాట్లాడి, వారికి లభిస్తున్న న్యాయ సహాయం, ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. చేసిన తప్పును మరలా చేయకుండా సత్ప్రవర్తనతో జీవించాలని అందరికీ చెప్పారు. జైలు అధికారులు జైలులోని మొత్తం నిర్వహణ, కార్యకలాపాలు, జైలులో ప్రమాణాలు, ఖైదీల హక్కుల విషయంలో సంతృప్తి వ్యక్తం చేశారు. జైలును నిర్వహించడంలో జైలు సిబ్బంది చేసిన కృషిని వారు ప్రశంసించారు. వీరితో పాటు ఈ కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ రఘు, జైలర్ కిరణ్, డిప్యూటీ జైలర్ ఎ.కల్యాణ్ బాబు పాల్గొన్నారు.

24 నుంచి జాతీయ స్థాయి నాటక పోటీలు



సమావేశంలో వివరాలు తెలియజేస్తున్న వజ్జా, బండారుపల్లి, నడింపల్లి

నాదెండ్ల, మే 19: ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు మండలంలోని సాతులూరు గ్రామంలో జాతీయస్థాయి నాటక పోటీలు జరుగుతాయని నటరత్న ఎన్‌టీఆర్ కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు వజ్జా మధుసూదనరావు, అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నడింపల్లి వెంకటేశ్వరరావులు ఆదివారం వివరించారు. ఈ సందర్భంగా వారు నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సాతులూరు గ్రామంలోని భారతి కళా వేదికపై ఈ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన మానం సుబ్బారావు, గడ్డం బుచ్చారావు, డాక్టర్ చదలవాడ ఫణీంద్రబాబు తదితరులకు నటరత్న ఎన్‌టీఆర్ పురస్కారాలు అందజేస్తామని వివరించారు. ఈ జాతీయ నాటిక పోటీలకు పలు రంగాలకు చెందిన దాతలు సహకరిస్తున్నారని వారు వివరించారు.

టీడీపీకి చెందిన యువకుడిపై దాడి

బాపట్లరూరల్, మే19: టీడీపీకి చెందిన యువకుడిపై కొంతమంది వైసీపీ మూకలు దాడికి పాల్పడిన ఘటన బాపట్ల పట్టణం దరివాదకొత్తపాలెంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ తరుపున ఓ యువకుడు ఎన్నికల సమయంలో తిరిగాడనే కోపం, పాతగొడవలను మనస్సులో ఉంచుకొని అదేగ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుని బంధువులు అర్ధరాత్రి సమయంలో ఆ యువకుడిపై దాడికి పాల్పడ్డారు. బాధితుడు బాపట్ల పట్టణ పోలీసుస్టేషన్‌కు ఫిర్యాదు కోసం వెళ్ళగా ఇరుపార్టీల నాయకులు కేసులు లేకుండా ప్రయత్నాలు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	158, 167,178
చికెన్ విత్ స్కిన్	306.00
చికెన్ స్కిన్ లెస్	316.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

శాంతిభద్రతలు పరిరక్షించటమే లక్ష్యంగా పోలీసు విధులు

● ఎస్పీ వకుల్ జిందాల్



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, మే 19 : జిల్లా ప్రజలకు రక్షణ కల్పిస్తూ శాంతిభద్రతలు పరిరక్షించటమే లక్ష్యంగా పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ, ఆతర్వాత చోటు చేసుకున్న ఘటనలపై జిల్లా పోలీసు శాఖ వేగంగా స్పందించి ఘటన స్థలాలకు 5 నిమిషాలలోనే చేరుకొని నిష్పక్షపాతంగా, నిబద్దతతో విధులు నిర్వహించి శాంతిభద్రతలను పరిరక్షించటం జరిగిందన్నారు. పలుచోట్ల ఘర్షణలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయటం జరిగిందన్నారు. ప్రజలకు రక్షణ కల్పిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించటమే లక్ష్యంగా జిల్లా పోలీసుశాఖ నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తుందని ఎస్పీ తెలిపారు. చీరాల కూటమి అభ్యర్థి ఎం.ఎం.కొండయ్య ప్రయాణిస్తున్న వాహనంపై చీరాల మండలం గవినివారిపాలెంలో జరిగిన దాడి ఘటనపై చీరాల రూరల్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి ఆరుగురిని అరెస్టు చేయటం జరిగిందన్నారు. గవిని వారిపాలెం పంచాయతీ పరిధిలో మరొక ఘటనపై నక్కా వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. చీరాల పట్టణం, వేటపాలెం మండలంలో వైసీపీ, కాంగ్రెస్‌పార్టీనాయకులు, కార్యకర్తల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలపై కాంగ్రెస్ అభ్యర్థి అమంచి కృష్ణమోహన్ వైసీపీ కార్యకర్తపై చేయి చేసుకున్న ఘటనపై, అమంచి ప్రయాణించే వాహనంపై రాళ్ళదాడికి పాల్పడిన ఘటనలపై ఐదు కేసులు నమోదు చేయటం జరిగిందన్నారు. వీటిలో ఇప్పటి వరకు 61 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. కొల్లూరు మండలంలో పోలింగ్ వేళ పలుగ్రామాలలో ఏజెంట్‌లను భయభ్రాంతులకు గురిచేసినట్లు కొల్లూరు పోలీసుస్టేషన్‌కు ఎటువంటి ఫిర్యాదులు రాలేదన్నారు. చెరుకుపల్లి మండలం రాంబొట్లవారిపాలెంలో జరిగిన ఘర్షణలపై చెరుకుపల్లి పోలీసుస్టేషన్‌లో రెండు కేసులను నమోదు చేసి 15 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. కర్లపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన రాజేష్ అనే దళితయువకుడిపై దాడి చేసిన ఘటనలో ఆరుగురిపై అట్రాసిటి యాక్ట్ కింద కేసు నమోదు చేయటం జరిగిందని ఈ ఘటనలో కర్లపాలెం ఎస్సైపై కూడా కేసు నమోదు చేసి సస్పెండ్ చేయటం జరిగిందన్నారు. ప్రస్తుతం కేసు విచారణ దశలో ఉందన్నారు. పోలీసు శాఖ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ఘర్షణలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేసినప్పటికి వివరాలు తెలుసుకోకుండా ప్రజలను అభద్రతా భావాలకు గురి చేసేవిధంగా ప్రకటనలు చేయటం సరికాదన్నారు. పోలీసు శాఖను సంప్రదించి కేసుల వివరాలను తెలుసుకోవాలని ఎస్పీ సూచించారు.

పిల్లల ఆసక్తిని గమనించి ప్రోత్సహించాలి

● బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని

బాపట్ల, మే 19 : చదువు పేరిట పిల్లలను ఒత్తిడికి గురి చేయకుండా వారిలో ఆసక్తిని గమనించి ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు తెలిపారు. బాపట్ల రోటరీ క్లబ్, స్టూడెంట్స్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో బాపట్ల రోటరీ కళ్యాణ మండపంలో ఈ తరంలో మేము ప్రత్యేకం అనే స్టూడెంట్స్ వర్కషాపు ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముప్పలనేని ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకశక్తిపై ప్రత్యేకశ్రద్ధ వహించి ప్రోత్సహించాలన్నారు. మంచి సంకల్పం ఉంటే ఎంతటి క్లిష్టమైన పనులైనా సాధించవచ్చు అని చెప్పారు. కేజి టూ పీజీ కోర్సులను బాపట్లలో అందుబాటులోకి తెచ్చిన దివంగత ముప్పలనేని శేషగిరిరావు కృషి అనన్య సామాన్యమని, ఆయన జీవితం నేటితరం విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రావూరి వీర రాఘయ్య, పిన్నిబోయన శ్రీమన్నారాయణ, సుధీర్‌బాబు, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు

సువర్ణరూపిణి అలంకరణలో శ్రీబగళాముఖి అమ్మవారు



శ్రీబగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, మే 19 : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవాలు ముగింపు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీబగళాముఖి అమ్మవారిని దర్శించుకోవటానికి వివిధ ప్రాంతాలు నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. భక్తులు అమ్మవారికి చద్దినైవేద్యాలు, పొంగళ్ళు సమర్పించుకున్నారు. అమ్మవారు సువర్ణరూపిణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు మౌలికసదుపాయాలను ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు మోదుగుల ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ సిబ్బంది కె.శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గజవాహనంపై కొలువుతీరిన భావదేవుడు



గజవాహనంపై ఊరేగుతున్న భావదేవుడు

బాపట్లమే 19 : పట్టణంలో చారిత్రక ప్రసిద్దిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీర భావన్నారాయణస్వామి 1431వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారు గజవాహనంపై కొలువుతీరారు. అర్చకస్వాములు శ్రీనివాసుల విఖనసమూర్తి, నల్లూరి విజయసారధి, నల్లూరి పాంచజన్యం, బృందావనం గోపిచంద్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించి తీర్దప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారిని గజవాహనంపై నగరోత్సవం చేశారు.

22 నుంచి శ్రీకాళీకమ్మ, వీరభద్రస్వామి దేవాలయ వార్షికోత్సవం



శ్రీకాళీకమ్మతల్లి, వీరభద్రస్వామివారు

కర్లపాలెం, మే 19 : మండలం కేంద్రంలోని కర్లపాలెం, ఏట్రవారిపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీకాళీకమ్మ, వీరభద్రస్వామి దేవాలయ 14వ వార్షిక వేడుకలను ఆలయ ప్రాంగణంలో ఈనెల 22 నుంచి 24 వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వాహకులు కుంచాల సాంబిరెడ్డి తెలిపారు. 22న ఏట్రవారిపాలెం గ్రామదేవత రెడంకమ్మతల్లి దేవస్థానం నుంచి అమ్మవారు, అయ్యవార్లకు పసుపుబండ్లతో ఊరేగింపుగా వచ్చి పట్టువస్త్రాల సమర్పణ, 23న రుద్రాభిషేకం, మహాకుంకుమార్చన, సాయంత్రం అమ్మవార్లు, అయ్యవార్లకు గ్రామోత్సవం, 24న పొంగళ్ళు, మొక్కుబడుల కార్యక్రమంతో సంబరాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఇరుపక్షాలపై కేసులు నమోదు

పిట్టలవానిపాలెం,మే 19 : మండల పరిధిలోని అల్లూరు గ్రామపంచాయతీలో ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైసీపీ, టీడీపీకి చెందిన నాయకులు పరస్పర గొడవలు పడ్డారు. పిట్టలవానిపాలెం మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బడుగు కృష్ణ, మరో ఎనిమిది మందిపై అల్లూరు గ్రామ సర్పంచ్ ఉప్పు చెంచులక్ష్మి చందోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అల్లూరు గ్రామానికి చెందిన టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బడుగు కృష్ణ అల్లూరు గ్రామ సర్పంచ్ ఉప్పు చెంచులక్ష్మిపై, అల్లూరు శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఛైర్మన్ వాలి శివారెడ్డి, మరో 16 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులను నమోదు చేసినట్లు చందోలు ఎస్సై టి.అనీల్ తెలిపారు. ఇరుపక్షాలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



మోపిదేవి వీరరాఘవయ్య కాలనీలో కీవాల్స్‌కే పరిమితమైన సీసీ రోడ్డు



అభివృద్ధికి నోచుకోని ఎక్స్‌మిలటరీ కాలనీలో పాఠశాలకు వెళ్ళే రహదారి

కీ వాల్స్ వేశారు.. రహదారిని మరిచారు

● ఏళ్ళ తరబడి అభివృద్ధికి నోచుకోని రహదారులు
● దృష్టిసారించని అధికారులు
● అవస్థలు పడుతున్న కాలనీ వాసులు

రేపల్లె, మే 19 : ప్రభుత్వం గ్రామాల్లో సీసీ రహదారులు వేసి అభివృద్ధి పరుస్తున్నామని ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఆచరణలో సాధ్యమైన దాఖలాలు లేవు. నిజాంపట్నం హార్బర్ రోడ్డులోని మోపిదేవి వీరరాఘవయ్య కాలనీలో, ఎక్స్ మిలటరీ కాలనీలో ప్రభుత్వం మంజూరు చేసిన రహదారులు కీవాల్స్‌తో సరిపెట్టారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి వేయకుండానే అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కై డబ్బులు తినేశారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండు సంవత్సరాల క్రితం రహదారిని అబివృద్ధి పరుస్తామని ఒక్కో రహదారికి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఆర్భాటంగా శంకుస్థాపనలు చేసి కీ వాల్స్ వేశారే తప్ప రెండు సంవత్సరాల నుంచి రహదారులు అభివృద్ధి చేసిన దాఖలాలు లేవంటూ కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. వేసిన కీవాల్స్ ఛిద్రమై ఎక్కడికక్కడ పగిలిపోయి కీవాల్స్ మధ్యలో వేసిన మట్టి బురదమయంగా మారి బురదలో నడుచుకుంటూ ఎక్స్‌మిలటరీ కాలనీలోని పాఠశాలకు నిత్యం విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలం కావటంతో ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొందంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి తక్షణమే రహదారులను అభివృద్ధి చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



నిజాంపట్నం హార్బర్ రోడ్‌లోని కాలనీలో...



ఎక్స్‌మిలటరీ కాలనీలో దెబ్బతిన్న కీవాల్

అకాల వర్షాలు.. మొక్కజొన్న రైతులకు కష్టాలు

● ఎండొస్తే అరబెట్టడం, చినుకులు పడితే పట్టాలు కప్పుకోవడం
● ఐదు రోజులుగా కంటి మీద కునుకు లేకుండా పడిగాపులు



చినుకులు పడటంతో మొక్కజొన్నపై పట్టాలు కప్పుకుంటున్న రైతులు

కొల్లూరు, మే 19 : అకాల వర్షాలకు మొక్కజొన్న రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. కొల్లూరు మండలంలో నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల మొక్కజొన్న పంటకు ఫంగస్ సోకుతుంది. ఖరీఫ్ చివరి దశలో తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో రబీ పైరు ఆలస్యమైంది. దీంతో మొక్కజొన్న పంట మే నెలలో రైతులు చేతికి వచ్చింది. తేమ శాతం లేకుండా విక్రయించుకునేందుకు రైతులు ఖాళీ ప్రదేశాల్లో మొక్కజొన్న కండెలను ఆరబెట్టుకుంటున్నారు. గత నాలుగైదు రోజులుగా అకాల వర్షాలు కురవడంతో రైతులు వాటిని ప్లాస్టిక్ పట్టాల్లో భద్రపరుచుకున్నారు. ఈ క్రమంలో వర్షానికి తడిసిన కండెలకు ఫంగస్ సోకింది. దీనిని గుర్తించిన రైతులు చినుకుపడితే మొక్కజొన్న పట్టాలు కప్పుకోవడం, ఎండొస్తే వాటిని ఆరబెట్టుకోవడం పరిపాటిగా మారింది. ఆరుగాలం ఎంతో కష్టించి పండించిన పంట దెబ్బతినకుండా రైతులు తమ కుటుంబ సభ్యులతో వానకు తడవకుండా ఎండ వస్తే వాటిని ఎండబెట్టుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.



ఫంగస్ వచ్చిన మొక్కజొన్న కండెలు

అకాల వర్షాలతో నష్టం : రైతు శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

మే నెలలో ఊహించని విధంగా అకాల వర్షాలు కురవడంతో మొక్కజొన్న పంట దెబ్బ తిందని కొల్లూరుకు చెందిన రైతు ఈమని శ్రీనివాసరావు వాపోయారు. కౌలుకు తీసుకుని మూడు ఎకరాలు మొక్కజొన్న పంట వేశానని, తమకు కాల్వల ద్వారా సాగునీరు రాకపోవడంతో నీటితడుల కోసం ఎన్నో వ్యయప్రయాసలు పడి పంట పండించడం జరిగిందన్నారు. తీరా పంట చేతికి వచ్చి దానిని ఎండబెట్టుకునే సమయంలో అకాల వర్షాలు కురిసి పంటను దెబ్బతిశాయని ఆవేదన వ్యక్తం చేశాడు. వాటిని కాపాడుకునేందుకు రోజు కుటుంబ సభ్యులతో మొక్కజొన్న గుట్టల వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు.

నీటి పారుదల శాఖ నిర్లక్ష్యం

● కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క
● ముందస్తు చర్యలు లేక రైతులకు నష్టం

వేమూరు, మే 19 : వేమూరు నియోజకవర్గంలోని నీటిపారుదల శాఖ నిర్లక్ష్యం వల్ల ఏటా రైతులు నష్టపోతున్నారు. భట్టిప్రోలు, రేపల్లె తెనాలి, చుండూరు మండలాల పరిధిలో ఉన్న సాగునీటి, మురుగు నీటి కాలువల మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల తుఫానులు వచ్చిన సందర్భంలో సంబంధించిన ప్రధాన డ్రెయిన్లలో నీరు స్తంభిస్తోంది. ఫైర్లలో నిలిచిన నీరు బయటకు పోయే అవకాశం లేకుండా ఉంటుంది. దీనివల్ల చేతికి వచ్చిన పంట దెబ్బతిని ఏటా రైతులు నష్టాన్ని చవిచూస్తున్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి నీటిపారుదల శాఖ పూర్తిగా నిర్లక్ష్యం వహించడం వల్ల రెండు సార్లు ఏర్పడ్డ తుఫాన్‌లకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రైతులు కునారిల్లారు. వేసవి కాలంలో కాలువల మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. కట్టలు బలోపేతం చేయడంతో పాటు కాలువలలో పేరుకున్న గుర్రపు డెక్క తదితర మొక్కలను పూడికతీతలో భాగంగా తొలగించాల్సి ఉంది. ఈ చర్యను చేపట్టకపోవడం వల్ల ఖరీఫ్ సాగులో రైతులు ఎంతగానో సమస్యలు ఎదుర్కోవడంతో పాటు నష్టాన్ని కూడా చవిచూస్తున్నారు. గత ఏడాది తాత్కాలిక మరమ్మతుల కోసం విడుదల చేసిన నిధులు అధికార పక్ష నేతలు స్వాహా చేసినట్లుగా సమాచారం. ఉన్నతాధికారులు రానున్న ఖరీఫ్ సాగును దృష్టిలో పెట్టుకుని రైతులకు మేలు చేసే విధంగా నిధులు కేటాయింపు చేయించి సహకరించాలని రైతులు కోరుతున్నారు.



రేపల్లె డ్రెయిన్‌లో పేరుకున్న గుర్రపు డెక్క

అవకాశం లేకుండా పోయింది. దమ్ము చేసి నాట్లు వేయడానికి రైతాంగానికి అదనపు ఆర్థిక భారం ఎదుర్కొవలసి ఉంది. దీనికి తోడు ఐదు సంవత్సరాలుగా కాల్వల పూడిక తీతలు తీయకపోవడంతో పెద్ద ఎత్తున పెరిగిన తూటికాడ, గుర్రపు డెక్క, పిచ్చిమొక్కల తొలగింపునకు అవకాశం లేకపోవడం, చప్టాల మరమ్మతులు, కాల్వ గట్ల మరమ్మతులకు వర్షాలు అడ్డంకిగా మారాయి. ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా ఇంత వరకు కాల్వల మరమ్మతులు, సాగునీటి పారుదలకు అడ్డంకులు తొలగించడానికి ముందస్తు చర్యలు తీసుకోలేదు. దీని వలన రైతాంగం గతంలో తుఫాను, అధిక వర్షాల వలన పంటలపై చేరిన వర్షపునీటితో పంటలు నష్టపోయారు. వీటిని దృష్టిలో ఉంచుకుని అయినా ఇరిగేషన్ శాఖ అధికారులు యుద్ద ప్రాతిపదికన పంట కాల్వలకు తాత్కాలిక ప్రాతిపదికనైనా మరమ్మతులు చేపట్టాలని రైతాంగం కోరుతున్నారు. మండలంలోని తుంగభద్ర సైడ్ ఛానల్, యడ్లపల్లి ఛానల్, పర్రా కాలువ, 6వ నెంబరు కాలువ, పాత కాలువ, బ్రాంచ్ కెనాల్‌లో పెద్ద ఎత్తున తూటికాడ పెరిగి సాగునీటి పారుదలకు అడ్డంకిగా మారింది. పిఎస్ ఛానల్‌పై చుండూరు, మోదుకూరు ప్రాంతాల్లో లో లెవల్ చప్టాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీని వలన ఈ ప్రాంత రైతులు సాగునీటి సమస్యలు గతంలో ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు రైతులు సాగునీటి సమస్యలు ఎదుర్కొనకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రైతాంగం కోరుతున్నారు.



భట్టిప్రోలు మెయిన్ డ్రైన్‌లో పేరుకున్న గుర్రపు డెక్క



టిఎస్ ఛానల్‌లో పెరిగిన తూటికాడ, గుర్రపుడెక్క

ముందుగానే తొలకరి జల్లులు

● రైతాంగానికి ఇబ్బందులు

చుండూరు మే 19 : సాధారణంగా రైతాంగం తొలకరి సమయానికి పొలాలు దుక్కులు దున్ని, గట్లు బాగు చేసుకుని పంటల సాగు కోసం తొలకరి వానల కోసం ఎదురుచూస్తుంటారు. అయితే ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశించే అవకాశం ఉండటం, ఇప్పటికే గత మూడు నాలుగు రోజులుగా వర్షాలు పడటంతో రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాల కారణంగా పొలాల్లో వర్షపు నీరు చేరడంతో దుక్కులు దున్నే

ఆంధ్రా ఇవాంజలికల్ లూథరన్ చర్చి శతాబ్ది ఉత్సవాలు



చర్చిలో మురళీకృష్ణను సత్కరిస్తున్న ఏఈఎల్‌సీ డెలికెట్ సభ్యులు

కొల్లూరు, మే 19 : ఆంధ్రా ఇవాంజలికల్ లూథరన్ చర్చి శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం కొల్లూరులోని ఆంధ్రా ఇవాంజలికల్ లూథరన్ పరిశుద్ధ దేవాలయం నిర్మించి వంద సంవత్సరాలు పూర్తి కావడంతో సంఘ పెద్దలు ఆదివారం శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఉత్సవాలకు తన వంతు సహాయ సహకారాలు అందించిన మండల టీడీపీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున సంఘం ఆధ్వర్యంలో విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఈఎల్‌సీ డెలికేట్ సభ్యులు, పీసీసీ సభ్యులు, సంఘ పెద్దలు, సంఘస్తులు, స్త్రీల సమాజం పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కర్లపాలెం, మే 19 : మండలంలోని యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988 నుంచి 1993 వరకు చదువుకున్న పూర్వవిద్యార్థులందరు యాజలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 31 సంవత్సరాలు తర్వాత కలుసుకున్న మిత్రులందరు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని యోగాక్షేమాలు తెలుసుకున్నారు. తమకు విద్యనందించిన గురువులను పూలదండలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని గంగాదేవికి పూజలు

కొల్లూరు, మే 19 : కూటమి గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని గంగాదేవి అమ్మవారికి టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రాప గ్రామానికి చెందిన కొంతమంది టీడీపీ నాయకులు ఆదివారం కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గం నాగాయలంక గ్రామంలో ఉన్న తలశిలవారి గంగాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడంతో పాటు వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి, బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి నక్కా ఆనందబాబు, తెన్నేటి కృష్ణప్రసాద్‌లు అత్యధిక మెజారిటీతో గెలిచి మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయాలని మొక్కుకున్నారు.



నాగాయలంకలోని గంగాదేవి అమ్మవారిని దర్శించుకున్న క్రాప టీడీపీ నాయకులు

అభివృద్ధికి ఓటు వేసిన యువత

● తెలుగు యువత అధికార ప్రతినిధి దేవిరెడ్డి

చుండూరు, మే 19 : జగన్ అరాచకం, చంద్రబాబు అభివృద్ధిని యువత, మహిళలు గుర్తించారు.. అందు కోసమే ఎన్నికల్లో యువత అభివృద్ధికి ఓటు వేశారని నియోజకవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధి దేవిరెడ్డి నాగేశ్వరరావు అన్నారు. మండూరులో ఆదివారం తెలుగు యువత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో యువత, మహిళలు పెద్ద ఎత్తున పోలింగ్‌లో పాల్గొన్నారని, కొన్ని గ్రామాల్లో 80 నుంచి 85 శాతం పోలింగ్ జరిగిందన్నారు. దానికి కారణం చంద్రబాబునాయుడు తమ పాలనా కాలంలో యువత ఉపాధి కోసం ముందు చూపుతో అమలు జరిపిన శాస్త్ర సాంకేతిక విద్య వలన యువత ఈనాడు దేశ, విదేశాల్లో అధిక వేతనాలతో ఉన్నత స్థాయిలో నిలవగలిగారన్నారు. ఆ రుణం తీర్చుకోవడం కోసం విదేశాల్లోను, ఇతర రాష్ట్రాల్లో నివశిస్తున్న యువత గ్రామాలకు వచ్చి పోలింగ్‌లో పాల్గొన్నారని, మహిళలకు కూడా ఆనాడు చంద్రబాబు డ్వాక్రా గ్రూపులాంటి పథకాలు అమలు జరిపి తోడ్పాటు అందించారన్నారు. ఇలా సంక్షేమం, అభివృద్ధి పథకాలు చంద్రబాబు పాలనలోనే జరిగాయన్నారు. జగన్ పాలనా కాలం పూర్తి అరాచకంగా సాగిందన్నారు. ఈ రెండు పరిపాలన వ్యత్యాసాన్ని గుర్తించే యువత, మహిళలు కూటమికే పెద్ద ఎత్తున ఓటు వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు కేశం శ్రీనివాసరావు, జొన్నకూటి సాంబశివరావు, అశోక్, షేక్ ఖాశిం, బుచ్చియ్య, రాంబాబు, కిరణ్, ప్రకాష్ పాల్గొన్నారు.

పుచ్చలపల్లి ఆశయ సాధన కోసం కృషి చేద్దాం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి



సభలో మాట్లాడుతున్న రమాదేవి

బాపట్ల,మే 19 : పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధన కోసం కృషి చేస్తూ ఆయన స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిద్దామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. పుచ్చలపల్లి 39వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలోని ఉప్పరపాలెం భోగిరెడ్డి వీరారెడ్డి స్థూపం వద్ద నిర్వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య, చివుకుల శేషశాస్త్రి పటాలకు పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సభలో రమాదేవి మాట్లాడుతూ దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమనిర్మాతలలో ఒకరైన సుందరయ్య ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజాసమస్యల పరిష్కారం కొరకు ఎన్ని ఆటంకాలు ఎదురైన వాటిని ఎదుర్కొని మరింత పట్టుదలగా కృషి చేయటమే సుందరయ్యకు అర్పించే ఘన నివాళి అని అన్నారు. కార్యక్రమానికి సీపీఎం సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్, షేక్ మహబూబ్ సుభానీ, రాజు వెంకటరెడ్డి, ఎ.రంగారెడ్డి, సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, భాస్కరరావు, సుబాషిణి పాల్గొని నివాళులు అర్పించారు.

● రేపల్లె, మే 19 : పేదల పక్షాన పోరాడి ప్రజలకు అండగా నిలిచి నిరాడంబర జీవితం గడిపిన పుచ్చలపల్లి సుందరయ్యను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మణిలాల్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అవగాహన కలిగి ఉండి, అంటరానితనంపై సమాజంలో అవగాహన కల్పిస్తూ కుల సమస్యపై పోరాటాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో సీపీఎం ప్రజా సంఘ నాయకులు ఈవీ లక్ష్మణ్‌రావు, జే.ధర్మరాజు, ఆగస్టీన్, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, మే 19 : దక్షిణ భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ పోరాటయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి సీపీఎం నాయకులు జోహార్లు అర్పించారు. సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మురుగుడు సత్యనారాయణ, బట్టు నాగమల్లేశ్వరరావు, ఆకురాతి శ్రీనివాసరావు, ఆరోను, ఎస్.గోపాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మనోజ్ పాల్గొన్నారు.

● కొల్లూరు, మే 19 : దివంగత కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్యకు సీపీఎం నాయకులు ఘన నివాళులర్పించారు. ఆదివారం అనంతవరంలో సుందరయ్య వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థూపం వద్ద జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొనిగల సుబ్బారావు, కనపర్తి నాగేశ్వరరావు, గోళ్ల పెద్ద శ్రీరాములు, ఉన్నం రమణ, బొనిగల ప్రసాద్, పిచ్చయ్య, జ్యోతిబస్, మార్కు, సునీల్, కోటయ్య, శుభశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● అమృతలూరు, మే 19 : మండలంలోని కూచిపూడిలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు టి కృష్ణమోహన్ మాట్లాడుతూ రాజకీయాల్లో నిస్వార్థంగా ప్రజా సేవ చేసిన మహనీయుడు సుందరయ్య అన్నారు. కార్యక్రమంలో అభిమానులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధభరితంగా కూరగాయల మార్కెట్

భట్టిప్రోలు, మే 19 : భట్టిప్రోలులో గల కూరగాయల మార్కెట్ దుర్గంధం వెదజల్లుతుంది. వ్యాపారస్తులు కూరగాయల వ్యర్థాలను ప్రాంగణంలో పడవేస్తుండడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు వ్యర్థాలు కుళ్ళి దుర్గంధం వెదజల్లుతున్నాయి. వ్యర్థాల పడవేసిన ప్రాంతంలో ఆవులు సంచరిస్తూ వ్యర్థాలను కదిలించడం వల్ల మరింతగా దుర్గంధం వెదజల్లుతుందంటున్నారు. కూరగాయలు కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు వచ్చే ప్రజలు ముక్కు మూసుకోవాల్సిందేనని వాపోతున్నారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాల్సిన పంచాయితీ సిబ్బంది అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుళ్ళిన వ్యర్థాల నుంచి దుర్వాసన వస్తుందని వ్యాపారాలు చేయలేకపోతున్నామని వ్యాపారస్తులు ఆవేదన చెందుతున్నారు. పన్నులు వసూలు చేస్తున్న పంచాయతీ అధికారులు పారిశుధ్యాన్ని మెరుగుపరచడంలో విఫలం చెందారని వ్యాపారస్తులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కూరగాయల మార్కెట్‌లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని వ్యాపారస్తులు, కొనుగోలుదారులు కోరుతున్నారు.



స్థానిక కూరగాయల మార్కెట్‌లో పడవేసిన వ్యర్థాలు

నిల్వ చేయలేం ..అమ్ముకోలేం..!

- తగ్గిన మిర్చి ధరలు
- గుంటూరు యార్డ్‌కు సెలవులు
- సిండికేట్‌గా మారుతున్న వ్యాపారులు
- అకాల వర్షాలతో దిక్కుతోచని స్థితిలో రైతులు


కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసేందుకు ట్రాక్టర్‌లో తెచ్చిన మిర్చి టిక్కీలు


కోల్డ్ స్టోరేజీలో నిల్వచేసిన మిర్చి టిక్కీలు

చీరాల, మే 19 : ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డ్ నడవడం లేదు. యార్డ్‌కు వార్షిక సెలవులు ప్రకటించారు. ఈ క్రమంలో ప్రైవేటు వ్యాపారులు సిండికేట్‌గా మారారు. ధరలను నియంత్రిస్తున్నారని మిర్చి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండించిన పంటను నిల్వ చేయలేం. విక్రయించలేమని వాపోతున్నారు. పర్చూరు, ఇంకొల్లు ప్రాంతాల్లోని కోల్డ్ స్టోరేజీలలో ఆర్థిక పరిపుష్టి ఉన్నవారు నిల్వ చేస్తున్నారు. మిగిలినవారు అయినకాడికి తెగనమ్ముతున్నారు. ఈ పరిస్థితులను ప్రైవేటు వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. దీంతో అన్ని రకాల మిర్చి ధరలు సగానికి సగం దిగజారాయి. విక్రయించలేం.. నిల్వ ఉంచలేమని రైతులు తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయం నిలకడగా ఉండటం లేదు. ఎప్పుడు ఏ పంటకు గిట్టుబాటు ధర ఉంటుందో అర్థం కాని పరిస్థితి. గతేడాది మిర్చి ధరలు ఒకింత ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఈ ఏడాది సుమారు 20వేల హెక్టార్లలో మిర్చి సాగు చేశారు. సాగు తొలినాళ్లలో ప్రతికూల పరిస్థితుల ఎదురయ్యాయి. ఆ తరువాత తెగుళ్ల బెడదతో పెట్టుబడులు పెరిగాయి. మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు వేల ఎకరాల్లో మర్చి పైరు దెబ్బతింది. మిగిలిన పైరుకు బెట్టకొచ్చిన సమయంలో తడులు ఇచ్చేందుకు సాగుదారులు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టాల్సి వచ్చింది. ఎండు మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండడంతో సాగుదారులు అప్పుచేసి మరీ పెట్టుబడులకు వెనకడుగు వేయకుండా ముందుకు సాగారు.

కోతల తొలినాళ్లలో ఆశాజనకంగా ధరలు

ఎండు, పచ్చి మిర్చి ధరలు పంట చేతికొచ్చే సమయానికి ఆశాజనకంగా ఉన్నాయి. ప్రైవేటు వ్యాపారులు కూడా పోటీపడి కళ్లాల్లోనే ఎండుమిర్చిని కొనుగోలు చేశారు. తేజ, బాడిగ, సూపర్ టెన్ తదితర రకాలు రకాన్ని బట్టి క్వింటా రూ.10వేల నుంచి రూ.30వేల వరకు ధర పలికాయి. అయితే పూర్తిస్థాయిలో సరుకు చేలల్లో నుంచి వచ్చే సమయానికి ధరలు తగ్గుముఖం పట్టాయి.

ఆగిన గుంటూరు మిర్చి యార్డ్

ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డ్ నడవటం లేదు. యార్డ్‌కు వార్షిక సెలవులు ప్రకటించారు. దీంతో మిర్చి ధరలు గణనీయంగా తగ్గాయి. ప్రస్తుతం రకాన్ని బట్టి రూ.9వేల నుంచి రూ.12వేల ధరలు పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు తక్కువ ధరలకు విక్రయించలేక కోల్డ్ స్టోరేజీలలో నిల్వచేయలేక సతమతమవుతున్నారు. ఒకింత చేమెల్లా ఉన్న రైతులు కోల్డ్‌స్టోరేజీలకు తమ సరుకును తరలించారు. తరలిస్తున్నారు. అయితే ఆర్థిక పరిపుష్టి లేనివారు, ప్రస్తుత పెట్టుబడుడులకు డబ్బు అవసరమైనవారు విక్రయిస్తున్నారు.

సిండికేట్‌గా మారిన వ్యాపారులు

కోల్డ్ స్టోరేజీలలో సరుకును నిల్వ చేసేందుకు అవకాశం లేనివారు, డబ్బు అవసరమైన రైతులు తమ సరకును ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీంతో ప్రైవేటు వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలను నియంత్రిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాగుదారులకు గిట్టుబాటు ధర లభించేవిధంగా తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం యంత్రాంగంపై ఎంతైనా ఉంది.

అకాల వర్షం .. అనుకోని నష్టం

నాలుగైదు రోజులుగా అడపాదడపా కురిసిన అకాల వర్షాలతో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప చేలల్లో చివరి కోతులు జరుగుతున్నాయి. కళ్లాల్లో కొంత సరుకు ఉంది. అందులో కాయలను గ్రేడ్ చేస్తున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షంతో నష్టం మూట గట్టుకోవల్సి వచ్చిందని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కనీసం గిట్టుబాటు ధరలు ఉంటే నష్టాలు లేకుండా వచ్చే ఏడాది సాగు చేయగలుతామని, లేదంటే సాగుకు స్వస్తి చెప్పాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా స్వామివారి శాంతి కల్యాణం

కారంచేడు(పర్చూరు), మే 19 : కారంచేడు గ్రామంలోని శ్రీ భూనీల సమేత శ్రీ ప్రయాగ మాధవస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలను పురస్కరించుకొని స్వామివారి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం వేకువ జాము నుండే ఆలయంలో స్వామివారిని స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేశారు. స్వామివార్లకు సుప్రభాత సేవ, అర్చనలు, భగవత్ ప్రార్థనలు గావించారు. అనంతరం స్వామివారికి లక్ష తులసి దళార్చన చేసి భక్తిని చాటుకున్నారు. మాధవ స్వామివారికి రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామివారి శాంతి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, భక్తులు చూసి తరించారు. అనంతరం ప్రసాద వినియోగాలు చేపట్టారు. కార్యక్రమం అనంతరం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం గ్రామోత్సవం నిర్వహించారు.

శబరిమలలో గొట్టిపాటి పూజలు


అయ్యప్పకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి, మిత్రులు

అద్దంకి, మే 19 : శబరిమలలో అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ స్నేహితులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు రెండు నెలలుగా ఎన్నికల ప్రచారంలో బిజీ బిజీగా ఉన్న గొట్టిపాటి మూడు రోజుల క్రితం శ్రైశైలం వెళ్లారు. అనంతరం స్నేహితులతో కలిసి శనివారం సాయంత్రం శబరిమల వెళ్లి అయ్యప్పస్వామి ని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై ప్రజలను చైతన్యపరచాలి


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అద్దంకిటౌన్, మే 19 : హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి బారినపడి ప్రజలు మరణించకుండా చైతన్య పరచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అద్దంకి సీహెచ్‌సీ ఐసీటీసీ కౌన్సిలర్ ఓబుల్‌రెడ్డి అన్నారు. ఆదివారం అంతర్జాతీయ క్యాండిల్ లైట్ స్మారక దినం సందర్భంగా హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, బాపట్ల జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో వ్యాధితో చనిపోయిన వారికి సంతాపంగా వారి ఆత్మకు శాంతి కలగాలని ర్యాలీ నిర్వహించారు. బాధితుల పట్ల వివక్ష చూపించకూడదని, వారిపట్ల ప్రేమ, ఆప్యాయత కలిగి ఉండాలని తెలిపారు. సమాజంలో వ్యాధి ప్రబలకుండా వ్యాధిగ్రస్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా మందులు వాడకుంటూ పోషకాహారం తీసుకుంటే వ్యాధి అంత ప్రమాదకరం కాదన్నారు. మాదకద్రవ్యాలు వినియగం ద్వారా యువత విచక్షణ కోల్పోయి శృంగారం చేయడం ద్వారా చాలా మంది వ్యాధి బారిన పడుతున్నారన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలు ప్రజల భాగస్వామ్యం, సమన్వయంతో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఓఆర్‌డబ్ల్యూ ఔట్రీచ్ వర్కర్స్ కరుణ, శ్రావణి, , పీఈ కే మల్లీశ్వరి, పార్వతి, శివపార్వతి పాల్గొన్నారు.

రైలులో మద్యం అక్రమ రవాణా

- నిందితుల అరెస్టు
- తెలంగాణకు చెందిన 99 క్వార్టర్ సీసాలు స్వాధీనం


వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌ఐ

చీరాలటౌన్, మే 19 : రైళ్లల్లో అక్రమ రవాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జీఆర్పీ ఎస్సై కొండయ్య హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైళ్లల్లో ఆదివారం రాత్రి తనిఖీలు చేస్తుండగా చీరాల మరియమ్మ పేటకు చెందిన కొడాలి రాఘవ, కారంచేడుకు చెందిన కనికమళ్ల చిన్నబాబు తెలంగాణకు చెందిన 99 క్వార్టర్ మద్యం సీసాలు చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలులో చీరాలకు తరలిస్తు ప్లాట్‌ఫాం నెం.3పై పట్టుబడ్డారు. దీంతో వారి వద్ద మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

అలంకారప్రాయంగా ఫిల్టర్ బెడ్‌లు

- కలుషిత నీటితో ప్రజలకు ఇక్కట్లు
- శుద్ధి చేయకుండానే కొళాయిల ద్వారా సరఫరా
- చర్మ వ్యాధులు వ్యాపిస్తాయని ప్రజల ఆందోళన
- కన్నెత్తిచూడని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు


అలంకారప్రాయంగా పర్చూరులోని ఫిల్టర్ బెడ్‌ల పరిస్థితి

పర్చూరు, మే 19 : ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు గ్రామాల్లో లక్షల రూపాలయ నిధులతో ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్‌లు అలంకార ప్రాయంగా మారింది. మండలంలో ఎక్కడ చూసినా ఫిల్టర్ బెడ్‌లు పనిచేయకపోవడంతో శుద్ధి చేయకుండానే నీటిని పంచాయతీ కొళాయి ద్వారా సరఫరా చేసున్నారు. దీంతో కలుషితంగా రంగుమారి దుర్గంధం వెదజల్లుతున్న నీటితో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న చందాన అసలే ఫిల్టర్ బెడ్‌లు పని చేయక పోవడం, కనీసం బ్లీచింగ్ కూడా వినియోగించకుండా నీటిని సరఫరా చేస్తుండడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనేక గ్రామాల్లోని ఫిల్టర్ బెడ్‌లతో కనీసం ఇసుకను కూడా మార్చలేని విధంగా పరిస్థితి నెలకొంది. ఫిల్టర్ బెడ్‌లను మెరుగు పరిచి వారిని సక్రమంగా వినియోగంలోకి తీసుకు వచ్చి ప్రజలకు సురక్షిత నీటిని అందించాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కనీసం కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. దీంతో కలుషిత నీటితో ప్రజలు కాలం వెల్లబుచ్చాల్సిన దుస్థితి నెలకొంది. మరో పక్క మంచినీటి చెవులను అభివృద్ధి చేయక పోవడంతో ఏళ్ల తరబడి తామర తూటి ఆకుతో పేరుకుపోయి నీరు కలుషితంగా ఉండడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. ఒక పక్క దుర్గంధం మరో పక్క రంగుమారి కలుషితంగా ఉన్న నీటితో ఎలాంటి చర్మవ్యాధులు ప్రబలు తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రమైన పర్చూరు, నూతలపాడు, ఉప్పుటూరు, అడుసుమల్లి, చెరుకూరు, నాగులపాలెం, కొల్లావారిపాలెం, పోతుకట్ల, వీరన్నపాలెం తదితర గ్రామాల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై దృష్టిసారించి అలంకార ప్రాయంగా మారిన ఫిల్టర్ బెడ్‌లను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పని చేయని ఫిల్టర్ బెడ్ నుంచి ట్యాంకులకు చేరుతున్న నీరు. రంగుమారి కంపుకొడుతున్న ఫిల్టర్ బెడ్‌లోని నీరు

చట్టం దృష్టిలో అందరూ సమానమే

- నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు
- ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరిక



చీరాలటౌన్, మే 19 : చట్టం దృష్టిలో అందరూ సమానమే నని, నేరాలకు పాల్పడితే ఎవ్వరినైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఆదివారం ఈపూరుపాలెం, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లను ఎస్పీ జిందాల్ పరిశీలించారు. ఎన్నికల సమయంలో జరిగిన అల్లర్లపై చర్చించారు. అంతేకాకుండా ఎన్నికల నేపథ్యంలో నమోదయిన కేసులకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ దాదాపుగా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. అయితే ఆ సమయంలో కొన్ని చోట్ల ఏర్పడిన సమస్యలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే నేర చరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. కౌంటింగ్ సమయంలో కూడా అల్లర్లు జరిగే అవకా శం ఉందని చెప్పారు.

ఈ నేపథ్యంలో సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్లు వివరించారు. పదేపదే కేసుల్లో ఉన్నవారిని జిల్లా నుంచి బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. ఎస్పీ వెంట డీఎస్పీ బేతపూడి ప్రసాద్, ఎస్బీ సిఐ మల్లికార్జునరావు, స్థానికల సీఐలు సోమశేఖర్, శేషగిరిరావు, సత్యనారాయణ, ఎస్సైలు ఇతర సిబ్బంది ఉన్నారు.

నిర్మాణానికి నోచుకోని నడిమి వాగు వంతెన

ఇబ్బందిపడుతున్న ఆరికట్లవారిపాలెం గ్రామస్థులు


ఆరికట్లవారిపాలెం, చందలూరు మధ్య నడిమి వాగుపై కూలిన వంతెన

పంగులూరు, మే 19 : నడిమి వాగుపై కూలిన వంతెనను తిరిగి నిర్మించలేదు. దీంతో రాకపోకలకు ఆరికట్లవారిపాలెం గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం గ్రామం నుంచి చందలూరు వైపు వెళ్లే రహదారిలో దశాబ్దకాలం కిందట వరద తాకిడికి నడిమి వాగుపై వంతెన కూలిపోయింది. నాటి నుంచి వంతెన నిర్మాణం జరగక పోవడంతో పంట పొలాలలో పనులు చేసుకునేందుకు గ్రామ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి దక్షిణం వైపున వాగుకి ఎగువ భాగంలో ఉన్న పొలాలలో పంట సాగు కష్టంగా ఉందని, వ్యవసాయ పనులు చేసుకోవాలన్నా, ఎరువులు తీసుకెళ్లాలన్నా తీవ్ర కష్టాలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘం ద్వారా వ్యవసాయ రుణాల కోసం, స్వయం సహాయక సంఘ మహిళలు బ్యాంక్ రుణాలు పొందేందుకు చందలూరు బ్యాంక్‌కు వెళ్లాలంటే ఈ రహదారే ఆధారం. నడిమి వాగుపై వంతెన కూలడం, దానికి దశాబ్దకాలంగా మరమ్మతులు లేకపోవడంతో రైతులు, మహిళలు పనుల నిమిత్తం పొలాలకు వెళ్లాలన్నా, చందలూరు చేరుకోవాలన్నా రెట్టింపు దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకుంది. పంట సాగు సమయంలో పొలాలకు కూళీలను చేరవేయాలంటే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాగుపై వంతెనను పునర్ నిర్మిస్తే కూతవేటు దూరంలో పొలాలకు, మూడు కిలో మీటర్ల దూరంలో చందలూరు చేరుకునే అవకాశం ఉంది. తక్షణమే నడిమి వాగుపై వంతెన పునర్ నిర్మించి తమ బాధలు తొలగించాలని గ్రామస్థులు, రైతులు వేడుకుంటున్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సుందరయ్యకు నివాళి

గంగవరం(ఇంకొల్లు), మే 19 : పుచ్చలపల్లి సుందరయ్య ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు వై.సిద్దయ్య అన్నారు. మండలంలోని గంగవరంలో సుందరయ్య వర్ధంత సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, సీఐటీయూ మండల కన్వీనర్ నాగండ్ల వెంకట్రావు, మాదాల అంజియ్య, గోవిందరెడ్డి, రమేష్‌కుమార్, భవనం శ్రీనివాసరెడ్డి, గోవింద్ పాల్గొన్నారు.

మార్టూరు, మే 19 : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి బత్తుల హనుమంతరావు మాట్లాడుతూ నీతి నిజాయతీతో విలువలు గలిగిన రాజకీయ జీవితం గడిపిన వ్యక్తి సుందరయ్య నేటి పాలకులకు ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో వై.రాంబాబు, సూరిబాబు, ఎస్‌కే గఫూర్, ఎస్‌కే షరీఫ్, వీరవల్లి కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, బాబు, మోహనరావు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

మార్టూరు, మే 19 : విద్యార్థులు పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోగలరని స్థానిక శాఖ గ్రంథాలయ గ్రంథ పాలకుడు రామారావు అన్నారు. వేసవి శిక్షణ తరగతులలో భాగంగా ఆదివారం బాల బాలికలకు పుస్తక పఠనంపై తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా నీతి కథలు, విజ్ఞానాన్ని పెంచే పుస్తకాలు, జాతీయ నాయకుల జీవిత చరిత్ర తదితర పుస్తకాలను పిల్లలతో చదివించారు. పుస్తకాలను ఇప్పటి నుంచే చదవడం అలవరుకుంటే భవిష్యత్‌లో మేధావులుగా రాణిస్తారని రామారావు తెలిపారు. అనంతరం కారంబోర్డు, చెస్ తదితర ఆటలను ఆడించారు. సెల్‌ఫోన్‌ల మోజులో పడి విద్యార్థులు పుస్తకాలు చదవడం మానేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నప్పటి నుంచే పుస్తక పఠనంపై ఆసక్తి ఉండేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు.

నేడు ప్రకాశం పంతులు వర్ధంతి

550 మార్కులు సాధించిన టెన్త్ విద్యార్థులకు బహుమతులు

అద్దంకిటౌన్, మే 19 : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 67వ వర్ధంతి సందర్భంగా అద్దంకిలోని ప్రకాశం మిత్ర మండలి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వాసవీనగర్‌లోని శ్రీనివాస కల్యాణ మండపంలో వర్ధంతి కార్యక్రమం జరుగుతుందని మిత్రమండలి అధ్యక్ష, కార్యదర్శులు ఇలపావులూరి శేషతల్పసాయి, షేక్ మహమ్మద్ రఫీ ఆదివారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా అద్దంకి మండలంలో పదివ తరగతిలో 550 మార్కులు, ఆపైన సాధించిన 143 మంది విద్యార్థులకు బహుమతి ప్రదానం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి టంగుటూరి ప్రకాశం పంతులు ముని మనవరాలు సుభాషిణి ముఖ్య అతిథిగా హాజరవుతారని మిత్రమండలి సభ్యులు, ఇతర సంస్థల సభ్యులు అందరు హాజరు కావాలని కోరారు.

132 మందికి ఉచిత వైద్య సేవలు


వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులు

గంగవరం(ఇంకొల్లు), మే 19 : మండలంలోని గంగవరం మంచాల వెంకట్రామయ్య, రంగమ్మ కల్యాణ మండపలంలో గంగవరం ఆరోగ్య, సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 132 మందికి ఉచితంగా వైద్య సేవలందించారు. బీపీ, షుగర్ పరీక్షలను చేశారు. డాక్టర్ మంచాల రమేష్‌కుమార్, అన్నంరాజు సాంబయ్య, డాక్టర్ ఈశ్వరరావు రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మంచాల వెంకట్రామయ్య, రంగమ్మ, అనంతలక్ష్మి జ్ఞాపకార్థం కుటుంబసభ్యుల ఆర్థిక సాయంతో రూ.200లకే రెండు నెలలకు సరిపడా మందులను సమకూర్చారు. కార్యక్రమంలో వేదిక కన్వీనర్ కరి బాలచందర్, రైతు సంఘం జిల్లా నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, ఏపీ సుబ్బారావు, జ్యోతి, నాగండ్ల వెంకట్రావు, రామారావు పాల్గొన్నారు.

వ్యక్తిపై మందుబాబుల దాడి

ద్విచక్ర వాహనం లాక్కొని పరార్


చికిత్స పొందుతున్న అనిల్

కొత్తపేట(చీరాలటౌన్), మే 19 : మద్యం మత్తులో వాహనాన్ని ఢీకొట్టడమే కాకుండా ద్విచక్ర వాహనాన్ని కూడా లాక్కుని పరారైన సంఘటన ఆదివారం మధ్యాహ్నం చీరాల సమీపంలోని కొత్తపేట మూడు రోడ్లు సెంటర్‌లో జరిగింది. బాధితుడు రామిశెట్టి అనిల్ తెలిపిన వివరాల ప్రకారం ఇతను ఓ ప్రైవేటు వైద్యశాలలో ఉద్యోగి. లక్ష్మీశ్రీనివాస కాలనీ నివాసం. ఈక్రమంలో ఆదివారం మధ్యాహ్నం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా మూడు రోడ్లు సెంటర్‌లో మద్యం మత్తులో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఢీకొట్టారు. దీంతో కింద పడిన అనిల్ ముఖానికి రక్త గాయాలు అయ్యాయి. వెంటనే పైకి లేచి అనీనిల్ వారిని నిలదీయగా అతడిని బెదిరించి ద్విచక్ర వాహనాన్ని కూడా లాక్కుని అక్కడి నుంచి పరారయ్యారు. ఈ క్రమంలో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతుండగా పోలీసులు వివరాలు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే వారిని ఇప్పటికే గుర్తించినట్లు సమాచారం.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీరాలటౌన్, మే 19 : గుర్తుతెలియని సుమారు 45 సంవత్సరాలు గల వ్యక్తి మండల పరిధిలోని జాండ్రపేట రైల్వే స్టేషన్ సమీపంలో రైలు రైలు కింద పడి మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. అతని ఎడమ చేతిపై విశ్రాంతమ్మ అనే పేరుతో పచ్చబొట్టు ఉంది. ఇతర ఎలాంటి ఆధారాలు లభించలేదు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు 9440627646 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.